
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 11 డిసెంబరు 2025 | 7



స్పీకర్ అయ్యన్నపాత్రుడికి జ్ఞాపిక అందజేస్తున్న నల్లమిల్లి

8

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే కోటి బిల్వార్చన : స్పీకర్

టెట్..మాకొద్దంటూ టీచర్ల నిరసన



రాజానగరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)నుంచి మినహాయించాలని కోరుతూ యుటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రాజానగరంలో నిరసన ప్రదర్శన చేశారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ పాస్ కావాలని..లేకుంటే వారిని సర్వీసు నుంచి తొలగించాలని ఇచ్చిన ఉత్తర్వుల నుంచి టీచర్లను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, జిల్లా కార్యదర్శి దయానిధి, మండలాధ్యక్షురాలు రాజేశ్వరి, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవదేవుడి సేవకై..

గోకవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆ దేవదేవుడి సేవకు ఏదైనా కావాలని అడిగితే ఎవరు మాత్రం కాదంటారు.. మేం ఇస్తాం..మేం ఇస్తాం అంటూ పోటీపడతారు. అనుకున్నదానికంటే ఎక్కువే ఇస్తారు.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలకు ఎండు గడ్డిని సమకూర్చాలని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తలంచారు. ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా తెలియడంతో రైతులు క్యూకట్టారు. రైతాంగం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 12 లారీల ఎండుగడ్డిని అందించారు.జ్యోతుల నెహ్రూ బావాజీపేట వద్ద జెండా ఊపి తిరుమల తిరుపతి గోశాలకు లారీల ద్వారా తరలించి మాట్లాడారు. శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పశుగ్రాసాన్ని సేకరిస్తున్నామని, కొన్ని రోజుల కిందట తంటికొండ నుంచి ఆరు లారీల ఎండు గడ్డిని ఇప్పటికే తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిల్లా చంటిబాబు, పాలూరి బోస్, మంగరాతి రాము, గళ్ళా రాము, బొట్టా రామకృష్ణ, కోట సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలకు తరలించే ఎండుగడ్డి లారీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



2 జిల్లాలకు 100 బస్‌లు

ఈ-బస్‌లు.. వస్తున్నాయ్!

కొత్తగా ప్రగతి రథచక్రాలు

వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 150 భారీ ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. తొలివిడత కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 100 బస్సులను కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కొన్ని నెలల కిందట రాజమహేంద్రవరం వచ్చినప్పుడు అధికారులతో ఈ విషయంపై చర్చ జరగ్గా ఉమ్మడి జిల్లాకు తొలి విడత కింద 150 బస్సులు అవసరమని వివరిం చారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాలకు ఈవీ బస్సులను కేటాయించాల్సి ఉన్న నేపథ్యంలో కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు వంద బస్సులను మాత్రమే కేటాయించారు. ఒక్కో బస్సులో 40 వరకు సీట్లుండే ఈవీ బస్సుల్లో అన్ని ఆధునిక సౌకర్యాలు ఉంటాయని అధికారులు వివరించారు. ఒక్కో బస్సు ధర రూ.1.50 కోట్లు.. 100 బస్సులకు రూ.150 కోట్ల అవుతుంది.

- ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి ఎలక్ట్రిక్ బస్సులు
- కాకినాడ, తూర్పునకు 100 కేటాయింపు
- కోనసీమకు మలి విడత
- ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం
- ఒక్కో బస్ ఖరీదు రూ.1.5 కోట్లు
- రూ.150 కోట్లతో కొనుగోలు
- ఆరు నెలల్లో రోడ్డెక్కనున్న బస్సులు
- ఉమ్మడి జిల్లాలో 20 ఛార్జింగ్ స్టేషన్లు
- భారీగా ఖర్చు తగ్గుతుందని అంచనా

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో త్వరలో ఆర్టీసీ ఈవీ బస్సులు రోడ్డెక్కనున్నాయి. మరో ఆరు నెలల్లో ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 50 చొప్పున ప్రభుత్వం ఈవీ బస్సు లను కేటాయిస్తోంది.కోనసీమ జిల్లాకు ఈ దఫా వాయిదా వేసి మలివిడతలో కేటాయించనున్నారు. ఒక్కో బస్సు రూ.1.50 కోట్ల చొప్పున 100 బస్సులకు ప్రభుత్వం రూ.150 కోట్లు వెచ్చించబోతోంది.బస్సుల రాకతో ఖర్చుల భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు.

ఒక్కో బస్సులో 40 సీట్లు

గత వైసీపీ సర్కారు ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసింది. కొత్త బస్సుల కొనుగోలు, అదనపు రూట్లను అటకెక్కించేసింది. ఇప్పుడు ప్రభుత్వం ఆర్టీసీకి అన్ని విధాలా సహకారం అందిస్తుండడంతో ప్రయాణికులను దగ్గరయ్యేందుకు ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేస్తోంది.అందులో భాగంగా కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 50 బస్సులు కేటాయిస్తూ ఆదేశాలిచ్చింది.ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది.ఈవీ బస్సులకు రూట్లను ఎంపిక చేయాలని ఆదేశించడంతో తాజాగా అధికారులు పూర్తిచేశారు. ఒక్కో బస్‌లో 40 సీట్లు ఉంటాయి.

20 ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు

100 ఎలక్ట్రికల్ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్లకు భారీగా ఖర్చవుతుందని భావిస్తున్నారు. హైస్పీడ్‌తో కూడిన ఛార్జింగ్ కేంద్రాలను 20 వరకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, తునిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.బ్యాటరీ బైక్‌కు కనీసం 6 గంటల వరకు ఛార్జింగ్ చేస్తేనే గానీ బ్యాటరీ ఫుల్ కాదు. కానీ రాబోయే ఎలక్ట్రికల్ బస్సులకు 2 గంటలు ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ ఫుల్ కానున్నాయి. కొత్త ఎలక్ట్రికల్ బస్సులు భారీ బ్యాటరీ సామర్థ్యంతో తయారవుతాయి. రోజులో ఒకసారి ఛార్జింగ్ చేస్తే సరిపోవచ్చని అధి కారులు చెబుతున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈవీతో లాభాల పంటే..

ఇప్పుడు ఎక్కడ చూసినా ఎలక్ట్రికల్ వాహనాలపైనే మొగ్గుచూపుతున్నారు. ఆర్టీసీ సైతం ఈవీ బాట పట్టింది. వచ్చే ఏడాది జూన్ నాటికి ఎలక్ట్రికల్ బస్సులను భారీగా రోడ్లపైకి దించబోతోంది. ఇప్పటికే డీజిల్ ధరలు పెరగడంతో నానాటికీ నిర్వహణ వ్యయం తడిసి మోపెడవుతోంది. దీంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఆర్టీసీ చవిచూస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల సర్వీసుల్లోను కొత్త పద్ధతులు అనుసరించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఖర్చులు నియంత్రించుకోవాల్సిన అవసరత ఏర్పడింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కొత్త బస్సుల కొనుగోలు, రద్దీ రూట్లలో సర్వీసుల పెంపు వరకు అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది.అందులో భాగంగా ఇకపై ఈవీ బస్సులను భారీగా కొనుగోలు చేసి అందిస్తోంది.

రూట్‌లు ఇలా

వంద ఈవీ బస్సుల్లో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల నుంచి విశాఖ, విజయవాడ రూట్‌లో 46 బస్సులు నడపనున్నారు.కాకినాడ- అమలాపురం, రాజమహేంద్రవరం-అమలాపురం రూట్‌లో 12, కాకినాడ- రాజమహేంద్రవరం నగరాల మధ్య రోజుకు 14 రెండు జిల్లాల ఈవీ బస్సులు తిప్పాలని నిర్ణయించారు.కాకినాడ జిల్లాకు కేటాయించిన 50 ఎలక్ట్రికల్ బస్సుల్లో కాకినాడ-విశాఖపట్నం 30, కాకినాడ -రాజమహేంద్రవరం 7, కాకినాడ- అమలాపురం 6, కాకినాడ- నర్సీపట్నం 4, కాకినాడ-తుని 3 చొప్పున ఖరారు చేశారు. తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించిన 50 బస్సుల్లో రాజమహేంద్రవరం- విజయవాడ 16, రాజమహేంద్రవరం- కాకినాడ 12, రాజమహేంద్రవరం-అమలాపురం 12, రాజ మహేంద్రవరం-తుని 10 బస్సులను తిప్పేలా ప్రణాళిక ఖరారు చేశారు.ఈవీ బస్సుల్లో టికెట్ ధరలు బాగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఇండిగో ఎగిరే!

- సాధారణ స్థితికి రాకపోకలు
- ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీకాంత్

రాజమహేంద్రవరం/కోరుకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి ఇండిగో విమానాల రాకపోకలు సాధారణ స్థితికి తిరిగి చేరుకున్నాయని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎస్‌కే.శ్రీకాంత్ తెలిపారు. ప్రతి రోజూ రాకపోకలు సాగించే 10 విమానాల్లో ఒకటి మినహా అన్నీ అందుబాటులోకి వచ్చాయన్నారు. ఢిల్లీ-రాజమండ్రి విమానం ఆపరేషన్ పరిమితుల వల్ల గురువారం వరకూ రద్దు చేశారని చెప్పారు. అలయన్స్ ఎయిర్ ద్వారా తిరుపతి మార్గంలో రాకపోకలు సజావుగా కొనసాగుతున్నాయన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.కొద్ది రోజులుగా ఇండిగో విమానయాన సంస్థలో ఏర్పడిన సంక్షోభం వల్ల ఆ విమానాల గమనంలో తీవ్ర అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే.



దివాన్‌చెరువు

ఫ్లయ్ ఓవర్ పనులు ఆరంభం

దివాన్‌చెరువు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దివాన్‌చెరువులో నిర్మించనున్న ఫ్లయ్ ఓవర్ పనులు ప్రారంభం అయ్యాయి. గత వారం రోజులుగా వేగంగా సాగుతున్నాయి. దివాన్‌చెరువులో పండ్లమార్కెట్ నుంచి పాలచర్ల గామన్ వంతెనను కలుపుతూ దాదాపు 2.55 కి.మీ మేర ఫ్లయ్ ఓవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదించి టెండర్లను పిలిచిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి ప్రభుత్వం గతంలో సేకరించిన భూముల్లో ఉన్న కట్టడాలు, చెట్లు వంటి వాటిని ఎక్స్‌కవేటర్ల సహాయంతో తొలగించే పనులు చేపడుతున్నారు. అయితే భూసేకరణ విషయంలో కొంత మంది యజమానుల నుంచి వచ్చిన అభ్యంతరాలతో ప్రత్యేక సర్వేయర్ల బృందాన్ని నియమించి మరోసారి సర్వే చేయించారు. ఈ నివేదిక అధికారులకు అందిన తర్వాత దానిపై చర్యలు తీసుకుంటారు. ఫ్లయ్ ఓవర్ పనుల సమయంలో ట్రాఫిక్ మళ్లింపునకు ప్రస్తుతం తొలగింపులు జరుగుతున్న ప్రదేశంలో సర్వీస్‌రోడ్లు ఏర్పాటు చేస్తారని తెలిసింది. ఫ్లయ్ ఓవర్ పనుల కారణంగా వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. అటూ ఇటూ గోతులు తవ్వేయడంతో పక్కకు తప్పుకోవడానికి అవకాశంలేక వాహనాలన్నీ రోడ్డుపైనే వెళ్లాల్సి వస్తోంది. ట్రాఫిక్ రద్దీ కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. బుధవారం సంతను సైతం అంతంతమాత్రంగా నిర్వహించారు. దీంతో కొనుగోలుదారులు నిరాశగా వెనుదిరిగారు. సంబంధిత అధికారులు ఫ్లైఓవర్ పనులు వేగవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకొని వీలైనంత త్వరగా తమకు ట్రాఫిక్ చిక్కులు తప్పేవిధంగా చూడాలని కోరుతున్నారు.

9

బైక్‌లు కొట్టేసి.. జల్సాలు చేసి..

29 బైక్‌లు స్వాధీనం.. ముగ్గురు దొంగల అరెస్ట్

భూగర్భ జలాల పెంపుపై నివేదిక ఇవ్వండి

అధికారులతో కలెక్టర్ సమీక్ష



రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో భూగర్భ జలాలను పెంచుకునే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని..ఆదిశగా క్షేత్రస్థాయిలో వెంటనే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్ కార్యాచరణపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, భూగర్భ జలాలు, డ్వామా, గ్రామ, వార్డు సచివాలయ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో భూగర్భ జలాల పెరుగుదల దిశగా స్వచ్ఛమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డ్వామా ఆధ్వర్యంలో డీసిల్టేషన్, ఇంకుడు గుంతలు, కుంటల పునరుద్ధరణ వంటి పనులకు సంబంధించి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 88 గ్రామాల్లో భూగర్భ జలాలు అత్యల్ప, 122 గ్రామాల్లో సగటు కంటే తక్కువగా ఉన్నాయన్నారు. భూగర్భ జలాల పెంపుపై దృష్టి సారిస్తే రూ.5 వేల కోట్ల ఆర్థిక వనరులు పరిరక్షిం చుకునే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే సమావేశం నాటికి అధికారులు సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు.కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్, భూగర్భ జలాల డీడీ వై.శ్రీనివాస్, డీడీఏ అధికారి పి.వీణాదేవి, డ్వామా ఏవో కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మేలురకం పశువీర్యం సరఫరా చేయాలి

డీడీ రాజేంద్రప్రసాద్‌తో రైతులు



దూడలను పరిశీలిస్తున్న డీడీ రాజేంద్రప్రసాద్

గోపాలపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు మేలుజాతి పశువుల పెంపకంతో అధిక పాల దిగుబడి సాధించవచ్చని పశుసంవర్ధక శాఖ డీడీ టి.రాజేంద్రప్రసాద్ అన్నారు. పెద్దాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్సపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాడి రైతులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పశువులు పాముకాటుకు గురైన సమయంలో అవసరమైన వ్యాక్సిన్ అందుబాటులో లేక పశువులు మృతిచెందతున్నాయని తెలిపారు. పశువుల గర్భధారణకు అవసరమైన మేలురకం వీర్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న వీర్యంతో నాశిరకం దూడలు పుడుతున్నాయన్నారు. అత్యధికంగా పాల ఉత్పత్తి చేస్తున్న ముగ్గురు రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డీఎం.నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.శశికుమార్, శేఖర్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళాలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో శుక్రవారం (12న) కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ,డిప్లమో,బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులై 35 ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి రూ.25 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు.వివరాలకు 7660823903లో సంప్రదించాలన్నారు.

ఉపాధి కార్యాలయంలో

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం మోడల్ కేరీర్ సెంటర్ ప్రాంగణంలో శుక్రవారం (12న) జాబ్ మేళా నిర్వహి స్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కె.హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు.దీని ద్వారా రాదిశాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో వంద ఖాళీలను భర్తీ చేస్తార న్నారు. 19-25 మధ్య వయసు కలిగి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ చదివిన వాళ్లు అర్హులని చెప్పారు. https:// tinyurl.com/jf1may25 లింక్ ద్వారా పూర్తి వివరాలతో రిజిస్టరు చేసుకోవాలన్నారు. వివరాలకు 9533221189 నెంబరులో సంప్రదించాలన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

21న పల్స్ పోలియో

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిసెంబరు 21న జరిగే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో బుధవారం పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్య, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం కోసం సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,89,550 మంది పిల్లలను లక్ష్యంగా గుర్తించామని, వీరికోసం 1,084 పోలియో బూత్‌లు, 62 ట్రాన్సిట్ టీమ్‌లు, 53 మొబైల్ టీంలను ఏర్పాటు చేశామన్నారు.

జీజీహెచ్‌కు 20 శాతం బ్లడ్‌బ్యాగ్‌లు ఇవ్వాల్సిందే


జీజీహెచ్ సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులు ప్రతి నెలా సేకరించే రక్తసేకరణ యూనిట్లలో 20 శాతం ప్రభుత్వ బోధనాసుపత్రికి ఇవ్వాల్సిందేనని రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డితో కలిసి జిల్లాలోని ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల యాజమాన్యాలు ఈ రూల్స్‌ను కచ్చితంగా పాటించాలన్నారు. చాలా బ్లడ్‌బ్యాంకులు 20 శాతం బ్లడ్ యూనిట్లను అందిస్తున్నా కొందరు విస్మరిస్తున్నారని..ఇది సరికాదన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు, ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఏపీఎఫ్ పరీక్షలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పోలీస్, కేంద్ర సాయుధ బలగాల్లోని సబ్-ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి బుధ వారం ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చెన్నై స్టాఫ్ సెలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పరీక్షలు నిర్వహించామని డీఆర్వో సీతారామ మూర్తి తెలిపారు. రెండు షిఫ్టుల్లో 122 మందికి 33 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

ఇలాగైతే.. ఎలాగండి!



- శస్త్రచికిత్స సమయంలో తప్పనిసరి
- అయినా లేవంటున్న సిబ్బంది
- ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు
- ఒక్కొక్కటి రూ.300 నుంచి రూ.500
- లబోదిబోమంటున్న బాధితులు
- డ్రగ్ స్టోర్‌లో స్టాకుపై అనుమానాలు
- సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

జీజీహెచ్‌లో నీరుడు బ్యాగ్‌ల కొరత

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఫోలీ బెలూన్ కేథటర్ (నీరుడు బ్యాగులు)లకు తీవ్ర కొరత ఏర్పడింది. శస్త్ర చికిత్సలు చేసే సమయంలో ఈ బ్యాగులను తప్పనిసరిగా వినియోగిస్తుంటారు. దీంతో రోగి కుటుంబీకులు ప్రైవేట్ మెడికల్ షాపుల నుంచి వీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. సమయం, డిమాండ్‌ను బట్టి ఒక్కో బ్యాగు రేటు రూ.300 నుంచి రూ.500ల వరకూ కొనుక్కోవాల్సి రావడం బాధిత కుటుంబీకులకు అదనపు భారంగా మారుతోంది. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే పేషెంట్ల కుటుంబీకులకు రాత్రి సమయంలో వీటి అవసరం పడితే ఎక్కడికి వెళ్లాలో తెలియక వారి పరిస్థితి దయనీయంగా మారుతున్నదని చెబుతున్నారు. నాలుగు రోజుల కిందట ఏజెన్సీ నుంచి వచ్చిన ఒక కేసుకు నీరుడు బ్యాగు అవసరమై అర్ధరాత్రి సమయంలో దానవాయిపేటలోని ఒక మెడికల్ షాపునకు వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చిందని తెలిసింది. నిజానికి జీజీహెచ్‌లో ఈ నీరుడు బ్యాగులను ఉచితంగా అందివ్వాలి. కానీ ఇవ్వడంలేదు. అధికారులు పట్టించుకోవడంలేదు.

స్టాకుపై అనుమానాలు?

జీజీహెచ్ డ్రగ్ స్టోర్‌లోని నీరుడుబ్యాగుల స్టాకుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు పలు ఫిర్యాదులు రావడంతో బుధవారం స్టోర్ అధికారుల పిలిపించి బ్యాగులపై ఆరా తీశారు.అన్ని విభాగాలకు పంపుతున్నామని, ఎంసీహెచ్ బ్లాకు నుంచి మాత్రం ఇండెంట్ రాలేదని లెక్కలు చెప్పినట్టు తెలిసింది. ఇంకా తమ వద్ద 200 వరకూ బ్యాగులు ఉన్నాయని కూడా వివరించినట్టు సమాచారం. ఇదే నిజమైతే శస్త్ర చికిత్సలకు వచ్చిన వారిని బయటి నుంచి ఎందుకు తెచ్చుకోమంటున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి కాకినాడ సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ఏదైనా డ్రగ్ లేదా పరికరం సరఫరా లేకపోతే లోకల్ పర్చేజ్ చేసుకునే వెసులుబాటు జీజీహెచ్ అధికారులకు ఉంటుంది. కానీ నీరుడుబ్యాగులను గత కొన్ని నెలలుగా కొనుగోళ్లు నిలిపివేసినట్టు తెలిసింది. లోకల్ పర్చేజ్‌లో నీరుడుబ్యాగులు సరఫరా చేసే కాకినాడలోని ఒక మెడికల్ స్టోర్ నుంచి ఇక్కడున్న కొంతమందికి కమీషన్లు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. దీంతో జీజీహెచ్‌లోని ఒక ఉన్నతాధికారి కాకినాడ నుంచి కాకుండా విజయవాడ నుంచి బల్క్‌గా కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చినట్టు సమాచారం. దీంతో మొత్తం పర్చేజ్ నిలిపివేశారనే ప్రచారం జరుగుతోంది. ఏదేమైనా శస్త్ర చికిత్సల సమయంలో అత్యవసరమైన ఫోలీ బెలూన్ కేథటర్ (నీరుడు బ్యాగుల) అందుబాటులో లేవనే వ్యవహారం జీజీహెచ్ పరువును రోడ్డున పడేసేలా ఉందని ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.



అధికారులు పట్టుకున్న ఇసుక లారీ

ఇసుక అక్రమంగా తరలిస్తున్న 4 లారీలు సీజ్

కొవ్వూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న 4 లారీలను సీజ్ చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుక ర్యాంపు నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక లోడ్ చేసుకుని అక్రమంగా తరలిస్తున్న 4 ఇసుకలారీలను బుధవారం డివిజనల్ టాస్క్‌ఫోర్స్ ఏఎస్ఐ జి.జి.ప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సీజ్ చేసిన లారీలపై తదుపరి చర్యలు నిమిత్తం మైనింగ్ అధికారులకు సిఫార్సు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

ఉడత ఊపులకు చింతకాయలు రాలుతాయా అని సాధారణంగా అందరూ అనుకుంటాం. అదేమో కానీ ఉడత కొరుకుడికి మాత్రం కొబ్బరికాయలు రాలిపోతున్నాయి. దీంతో కొబ్బరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఉడత చిన్నదే కానీ అదిచేసే నష్టం మాత్రం ఎక్కువగా ఉంటోందని



కొబ్బరి చెట్లకు అమర్చిన స్టీలు తొడుగులు

పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు గమనించారు. దీంతో ప్రయోగాత్మకంగా కొబ్బరిచెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటుచేసి ఉడతలు చెట్టు ఎక్కకుండా నివారిస్తున్నారు. దీంతో ఆశించిన ఫలితాలు కొంతమేర వస్తున్నాయని చెప్తున్నారు.



ఉడత కొట్టుడు!





- కొబ్బరికాయలను డొల్ల చేస్తున్న చిట్టి ప్రాణులు
- కన్నీరుమున్నీరవుతున్న రైతులు
- పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానంలో చెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటు
- ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న శాస్త్రవేత్తలు
- ఆశించిన స్థాయిలో ఫలితాలు

పెద్దాపురం-ఆంధ్రజ్యోతి

కొబ్బరి పేరు చెప్పగానే మనందరికీ గుర్తుకొచ్చేది కోనసీమ. కల్పవృక్షంలాంటి కొబ్బరిపంటపైనే ఆధారపడి అక్కడి రైతులు తమ జీవితాలను వెళ్లదీస్తుంటారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఎకరాల్లో కొబ్బరి సాగవుతుంటే అధిక భాగం కోనసీమలో విస్తరించి ఉంది. కోనసీమను కొబ్బరిసీమ అని కూడా పిలుస్తారు. ఇక్కడి కొబ్బరి రైతులకు ప్రస్తుతం ఉడతల రూపంలో కొత్త సమస్య వచ్చిపడింది. కోతులకంటే ఉడతలే కొబ్బరి తోటలను అధికంగా పాడుచేస్తున్నాయి. ఉడతలు గుంపులుగుంపులుగా వచ్చి ఇంకా ఎదగని లేత కాయలను పూర్తిగా నాశనం చేస్తున్నాయి. చూడ్డానికి చిన్నగా అమాయకంగా కనిపించే ఈ ప్రాణులు వందలాది ఎకరాల్లో కొబ్బరి తోటలను నాశనం చేస్తూ రైతులకు లక్షల్లో నష్టాన్ని మిగులుస్తున్నాయి.

కొబ్బరిని సాధారణంగా నల్లముట్టె, కొమ్ము, ఎర్రముక్కు, ఇరియోఫిడ్ నల్లి మొదలైన పురుగులు ఆశించి నష్టపరుస్తాయి. కొబ్బరి తోటల్లో పిందెలను ఉడతలు పాడుచేయడం అనేది సమస్యగా మారింది. దీంతో రైతులకు నష్టం తీవ్ర వాటిల్లుతోంది. ఉడతలు కొబ్బరి పిందెలను కొరికి, రసం పీల్చడం లేదా తినేస్తాయి. దీనిని అరికట్టడానికి గింజలను చెట్లకు కట్టడం, ఉచ్చులు పెట్టడం, విషపు ఎరలను వాడటం వంటి వాటిని సాధారణంగా రైతులు చేస్తుంటారు. ఉడతలు లేత కొబ్బరికాయలకు రంధ్రాలు చేసి లోపలంతా తినేస్తుంటాయి. దీంతో పైకి బాగానే కనిపించినా లోపల డొల్లగా మారుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానంలో కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు (గిర్డిల్స్) ప్రయోగాత్మకంగా అమర్చి ఉడతల వల్ల పంటకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నారు.

కొబ్బరి పిందెలనే ఎందుకు పాడుచేస్తాయి..

ఉడతలు క్షీరదాలు తరగతికి చెందినవి. ప్రపంచవ్యాప్తంగా ఉడతలు 200 కంటే ఎక్కువ జాతులు ఉన్నప్పటికీ వాటిని ప్రధానంగా మూడు విభాగాలుగా వర్గీకరించారు. వాటిలో చెట్లపై నివసించేవి, నేలపై నివసించేవి, ఎగిరే ఉడతలు ఉన్నాయి. ఉడతలకు నిరంతరం ఆహారం అవసరం. ముఖ్యంగా శక్తిని ఇచ్చే కొబ్బరి పిందెలు వాటికి మంచి ఆహారం. ఉడతల సంతతి పెరిగేకొద్దీ ఆహార అవసరాలు పెరుగుతాయి. అందువల్ల అవి తోటలపై పడి దాడి చేస్తాయి. ఉడతలు శాఖాహారులు అయినప్పటికీ చాలా వరకు ఉభయచరుల్లా ప్రవర్తిస్తాయి. విత్తనాలు, గింజలు, పండ్లు, పుట్టగొడుగులు, పచ్చికాయలు, ఆకులను ఆహారంగా తీసుకుంటాయి. కొన్ని జాతుల ఉడతలు పక్షి గుడ్లు, చిన్న పెంకు పురుగులు, చిన్న సరీసృపాలను కూడా ఆహారంగా తీసుకుంటాయి. ఉడతలు ఆహారాన్ని దాచుకునే అలవాటు కలిగి ఉంటాయి. శీతాకాలం కోసం గింజలను నేలలో దాచి పెడతాయి. కొన్నిసార్లు అవి దాచిపెట్టిన స్థానాన్ని మరిచిపోవడంతో వాటి నుంచి కొత్త మొక్కలు వస్తాయి. ఆ విధంగా పర్యావరణ వ్యాప్తిలో కూడా అవి భాగస్వాములు అవుతాయి.

పక్వానికి వస్తున్న కాయలకు రంధ్రాలు..



కాయలు బాగా పెరిగి లోపల లేత కొబ్బరి గుజ్జు ఏర్పడుతున్న దశలో ఉడతలు దాడి చేస్తాయి. ఉడతలు తమ పదునైన దంతాలతో కాయలపై భాగంలో లేదా పక్క భాగంలో చిన్న రంధ్రాలు చేస్తాయి. ఇవి లోపలి గుజ్జు వరకు చొచ్చుకుపోతాయి.

వాణిజ్య విలువ తగ్గడం...

రంధ్రాలు చేయడం వల్ల కాయ పాడైపోయి నీరుగారిపోతుంది. ఈ విధంగా దెబ్బతిన్న కాయలకు మార్కెట్లో ఎలాంటి విలువ ఉండదు. ఉడతలు చేసిన రంధ్రాల ద్వారా గాలిలోని బ్యాక్టీరియా లేదా శిలీంధ్రాలు (ఫంగస్) లోపలికి ప్రవేశించి కాయ మొత్తం కుళ్లిపోవడానికి దారితీస్తుంది.

పూత నాశనం..

కొన్ని సందర్భాల్లో ఉడతలు కొబ్బరి పూతను కూడా కొరికేస్తాయి. దీంతో కాయలు కట్టే అవకాశం లేకుండా పోతుంది. ముఖ్యంగా కొబ్బరి పంటలో ఉడతల నష్టాన్ని రైతులు సరిగా గమనించకపోతే అది కేవలం పిందెలు రాలిపోవడం లేదా తెగుళ్ల కారణంగా సంభవిస్తుందని అనుకుంటారు. కానీ చాలాసార్లు దగ్గరగా పరిశీలిస్తే కొరికిన గుర్తులు లేదా రంధ్రాలు కనిపిస్తాయి.



ఉడతలు కొట్టేసిన లేత కొబ్బరికాయలు



లేత కొబ్బరి పిందెలే లక్ష్యం...

ఉడతల కారణంగా కొబ్బరిలో ప్రధానంగా పిందె దశ, పక్వానికి కాయలు వస్తున్న దశలో నష్టం కలుగుతుంది. పూత దశ దాటి కాయగా మారుతున్న లేత కొబ్బరి పిందెలను ఉడతలు లక్ష్యంగా చేసుకుంటాయి. చిన్న పిందెలను కొరికి వాటి లోపల ఉన్న మృదువైన భాగాన్ని తింటాయి. దాడి కారణంగా పిందెలు తమ పోషణను కోల్పోయి పూర్తిగా పెరగకముందే చెట్టు నుంచి రాలిపోతాయి. దీనివల్ల దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ

- కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు (గిర్డిల్స్) ఏర్పాటుచేసుకోవడం ద్వారా అవి చెట్టు ఎక్కలేక జారిపోతాయి.
- కొబ్బరి పిందెలు ఉన్న గెలలకు సన్నటి వలలు లేదా ప్లాస్టిక్ కవర్లు కట్టడం వల్ల ఉడతలు వాటిని చేరలేవు.
- ఉడతలను పట్టుకోవడానికి ప్రత్యేకమైన ఉచ్చులు ఏర్పాటుచేయాలి.
- చెట్టు కాండం చుట్టూ జింక్ షీట్లు చుట్టడం వల్ల అవి చెట్టుపైకి ఎక్కడం కష్టమవుతుంది.
- ఆహారంలో విషపు ఎర కలిపి ఉంచాలి.
- తోటల్లో గుడ్లగూబలు వంటివి ఉండేలా చూసుకోవడం వల్ల ఉడతలను నియంత్రించవచ్చు.



చర్యలు

- బోనులు పెట్టి ఉడతలను పట్టుకోవడం, పట్టుకున్న ఉడతలను తోటలకు దూరంలో, అడవి ప్రాంతంలో వదిలివేయాలి.

ఉడతలు చురుగ్గా ఉండి వేగంగా కదులుతాయి. కాబట్టి వాటిని నివారించడానికి రక్షణ కంచెలు లేదా సంప్రదాయ పద్ధతులు పనిచేయవు. వ్యవసాయ శాఖ నిపుణులు చెట్టు కాండాలకు మెటల్ షీట్లు బిగించడం లేదా వేప నూనె పిచికారీ చేయడం వంటి పద్ధతులను పాటిస్తున్నారు. అయితే ఆర్థిక స్తోమత లేని రైతులు వీటిని అవలంబించలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి ఉడతల నియంత్రణకు అవసరమైన సామగ్రిని రాయితీపై అందించాలని కోరుతున్నారు.

ప్రయోగాత్మకంగా స్టీలు తొడుగులు ఏర్పాటు చేశాం



ఉడతల బారి నుంచి కొబ్బరి చెట్లను రక్షించుకునేందుకు వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉన్న కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటుచేశాం. ప్రయోగాత్మకం అమలుతో సత్ఫలితాలు వచ్చాయి. ఉడతలు కొబ్బరి చెట్లు ఎక్కడానికి ప్రయత్నం చేసినప్పటికీ స్టీలు కారణంగా వాటి కాళ్లకు పట్టు దొరక్క కిందకు జారిపోతున్నాయి. తద్వారా కొబ్బరి పిందెలు, పువ్వులను రక్షించుకునే వీలుకలిగింది.

డాక్టర్ ఇంజేటి సుధీర్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త
వ్యవసాయ పరిశోధనా స్థానం, పెద్దాపురం

ఉమ్మడి తూర్పులో 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: పీడీజే గంధం సునీత



రాజమహేంద్రవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అర్హమైన క్రిమినల్, సివిల్ కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, ప్రమాదాలు, బ్యాంకులు, ప్రీ-లిటిగేషన్ కేసులతోపాటు ట్రాఫిక్ చలానా, ఎక్సైజ్‌కి సంబంధించి డ్యూపెయిడ్, నాన్ డ్యూటీ పెయిడ్ కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే ఆ తరహా 18,035 కేసులను గుర్తించామన్నారు. ఉమ్మడి జిల్లాలో 46 న్యాయ పీఠాలను ఏర్పాటు చేశామన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షణలో ప్రతి మూడు నెలలకు ఒకసారి దేశవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నారన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించడం, తక్కువ ఖర్చుతో న్యాయం అందడం, రాజీ ద్వారా చట్టపరమైన వివాదాలకు ముగింపు, రాజీపడిన కేసులకు కోర్టు ఫీజు తిరిగి ఇచ్చేయడం, ఈ తీర్పులను తుది తీర్పులుగా పరిగణించడం వల్ల ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందన్నారు. 2024లో 4 జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించగా 10,623 కేసులకు పరిష్కారం లభించిందన్నారు. బాధితులకు రూ.162కోట్ల 35లక్షల 24వేల 590 పరిహారం అందిందని చెప్పారు.అలాగే ఈ ఏడాది ఇప్పటి వరకూ జరిగిన 3 జాతీయ లోక్ అదాలత్‌లలో 17,073 కేసులకు పరిష్కారం లభించగా.. రూ.100కోట్ల 99లక్షల 11వేల 504 పరిహారాన్ని బాధితులు అందుకున్నారని పీడీజే గుర్తు చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ఎస్‌కేఆర్‌కు పసిడి పంట

రాష్ట్ర స్థాయి పోటీల్లో 6 గోల్డ్ మెడల్స్‌తోపాటు ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ కైవశం



మెడల్స్ సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మార్షల్ ఆర్ట్స్(ఉషు) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన ఇండియా స్టేట్ ఉమెన్స్ లీగ్ 2025-2026 పోటీల్లో స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు పసిడి పంట పండించారు. ఆరు గోల్డ్ మెడల్స్‌తోపాటు ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కె.సత్యవేణి, కె.జీవన్, కె.కుసుమ, కె.మహాసుహాసిని, ఎం.భార్గవి, జి.కృష్ణవేణి గోల్డ్‌మెడల్స్ సాధించగా స్వర్ణలత సిల్వర్ మెడల్, రాజ్యలక్ష్మి, పావని బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ రాఘవకుమారి తెలిపారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థినులు జనవరిలో ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే నేషనల్ ఉమెన్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థినులను ఆమె అభినందించారు.

13న 1008 మందితో వందేమాతరం గీతాలపన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న తోట సుబ్బారావు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థుల్లో తెలుగు భాష పట్ల మమకారం పెంచేందుకు 1008 మంది విద్యార్థులతో శతక పద్య సహస్రాధిక గళ ధారణ, వందేమాతర గీతాలాపన కార్యక్రమం, పెరవలి మాతృభాషా పరిరక్షణ సమితి, ఆంధ్ర కేసరి యువజన సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గోదావరి గట్టున ఉన్న చాంబర్ భవనంలో జరుగుతుందని సమన్వయకర్తలు సీహెచ్‌సీ నాగభూషణం, దేశిరెడ్డి బలరామనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సరస్వతీ ఘాట్‌లో ఆధ్యాత్మికవేత్త తోట సుబ్బారావు బుధవారం ఆవిష్కరించారు.కార్యక్రమంలో మాదిరాజు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా పాల్గొన్నారు.

ఘనంగా కేశవస్వామి

పవిత్రోత్సవాలు



మహాస్నపనం నిర్వహిస్తున్న పండితులు

ఆత్రేయపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు రెండో రోజు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్రోత్సవ పూజలు, ఉత్సవమూర్తులకు మహాస్నపనం, శాంతి హోమం, సాయంత్రం పంచపవిత్రాల ఊరేగింపు, పంచ సయ్యాధివాసం, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీనివాసుల వెంకటాచార్యుల బ్రహ్మత్వంలో నిర్వహించారు. ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో బీహెచ్‌వీ రమణమూర్తితోపాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఎస్ఐఎఫ్‌టీలో సిలబస్ మార్పునకు కమిటీ

కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఎస్ఐఎఫ్‌టీ)లో ప్రస్తుతం కొనసాగుతున్న కోర్సులపై మూల్యాంకనం చేపట్టి కొత్తగా సిలబస్ రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర మత్స్య శాఖ జీవోఆర్‌టీ నెంబర్ 414 జారీ చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా ఫిష రీస్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ వ్యవహరించనున్నారు.మెంబర్ కమిటీ కన్వీనర్‌గా ఎస్ఐ ఎఫ్‌టీ ప్రిన్సిపాల్ కొనసాగుతారు.కమిటీలో సభ్యులుగా 9 మందిని నియమించగా, అందులో కాకినాడ నుంచి ఎఫ్ఆర్ఎస్ ఓఎస్‌డీ సభ్యుడిగా ఉన్నారు.ఈ కమిటీ ఎస్ఐఎఫ్‌టీలో 6 నెలల కోర్సులకు సంబంధించి సమీక్షలు జరిపి మార్పులు,చేర్పులు సూచించనుంది.

డ్రంకెన్ డ్రైవ్‌కు మూడ్రోజుల జైలు

బిక్కవోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో గ్రామానికి చెందిన జమ్ము శివ మద్యం తాడి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. దీంతో అతడిని బుధవారం అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా మూడు రోజులు జైలు శిక్ష విధించారన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోటి బిల్వార్చన



వేద పండితుడు కృష్ణమూర్తిని సత్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల, గోరంట్ల, ఎమ్మెల్సీ సోము

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- పెదపర్తిలో ముగిసిన పూజలు
- పార్వతీరామలింగేశ్వరుల కల్యాణం

అనపర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న కాంక్షతోనే కోటి బిల్వార్చన నిర్వహించినట్టు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. అనపర్తి మండలం పెదపర్తిలోని పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేద పండితుడు యలమంచిలి కృష్ణమూర్తి నేతృత్వంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో 41రోజుల పాటు రుద్రయాగ, నవచండీయాగ, నవగ్రహ యాగ సహిత మహా కోటి బిల్వార్చన, కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల చివరి రోజైన బుధవారం ఉదయం నుంచి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అయ్యన్న పద్మావతి దంపతులతో బాటు ఆయన కుమారులు కోడళ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పార్వతి రామలింగేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రం దొంగలపాలైందని ప్రస్తుతం ప్రగతి పథంలో పయనిస్తుందని, రాబోయే రోజుల్లో దుష్ట శక్తుల పాలు కాకుండా కాపాడాలని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వంటి నేతలు క్షేమంగా ఉండాలని ఈ కార్యక్రమాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుడు యలమంచిలి కృష్ణమూర్తిని అయ్యన్నతోపాటు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజుల చేతుల మీదుగా సత్కరించారు. అలాగే వేద పండితులను సన్మానించారు. అనంతరం అయ్యన్నను ఎమ్మెల్యే నల్లమిల్లి సత్కరించి మెమొంటోను అందజేశారు.కార్యక్రమంలో ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్, వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రొయ్యల ఎగుమతుల్లో కాకినాడ-గోదావరి కీలకం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రొయ్యల ఉత్పత్తిలో ముఖ్య కేంద్రంగా నిలిచిన కాకినాడ-గోదావరి ప్రాంతం ఎగుమతుల్లో మరింత కీలక పాత్ర పోషించనుందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. దేశంలో ఆక్వా రంగం వృద్ధి,మార్కెట్ విస్తరణ, మత్స్యకారుల ఆర్థిక బలోపేతం, దక్షిణ భారత ఆక్వా ఉత్పత్తుల తక్షణ రవాణా సౌకర్యాల ప్రాముఖ్యతపై బుధవారం రాజ్యసభలో ఎంపీ సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు కేంద్రం సమగ్ర నివేదిక అందించింది. 2024-25లో భారత్ రూ.62.408 కోట్ల విలువైన 16.98 లక్షల టన్నుల సముద్ర ఆహార ఉత్పత్తులను 130 దేశాలకు ఎగుమతి చేసిందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ వెల్లడించారు. కొత్త మార్కెట్ల విస్తరణ, విలువ జోడింపుపై కేంద్రం చేపట్టిన చర్యల వల్ల కాకినాడ నుంచి రొయ్యల ప్రాసెసింగ్, ఎగుమతి యూనిట్లకు అవకాశాలు పెరగనున్నాయని తెలిపారు. జీఎస్టీ తగ్గింపుతో విలువ ఆధారిత ఉత్పత్తులకు, స్థానిక ప్రాసెసింగ్ యూనిట్లకు లాభం చేకూరే అవకాశం ఉందన్నారు. కొత్త మార్కెట్ల విస్తరణకు ఎంపెడా ద్వారా అవగాహన కార్యక్రమాలు, కొనుగోలు- అమ్మకందార్ల సమావేశాలు, విలువ జోడింపుపై శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కేంద్ర మంత్రి వెల్లడించారు.

వందేమాతరం చర్చలో.. వందేమాతరం గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఎంపీ సతీష్‌బాబు ప్రసంగించారు. ఆయన వందేమాతరం గీతం చరిత్ర, భారత స్వాతంత్ర్య సమరంలో దాని పాత్ర, తన స్వస్థలం కాకినాడతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. బకించంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో లక్షలాది మందికి ప్రేరణగా నిలిచిందన్నారు. కాకినాడలో 1923లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభల్లో వందేమాతరం గీతంపై అభ్యంతరంతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ ఆలీ జౌహార్ బయటకు వెళ్లిపోవడం బాధాకర అధ్యాయంగా మిగిలిందన్నారు. అదే ఘటనకు శతాబ్దం తర్వాత చరిత్ర ఇచ్చిన సమాధానంగా ఈ ఏడాది నవంబరు 7న కాకినాడలోని మౌలానా మహమ్మద్ ఆలీ వీధికి వందేమాతరం మార్గ్ అని పేరు పెట్టిన విషయాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు తనకు ఈ చర్చలో మాట్లాడే అవకాశం కల్పించారని సతీష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర కళాశాలల ఫుట్‌బాల్ విజేతగా కాకినాడ ఐడియల్



ఫుట్‌బాల్ ట్రోఫీతో ఐడియల్ కళాశాల విద్యార్థులు

కాకినాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర కళాశాలల ఫుట్‌బాల్ విజేతగా కాకినాడ ఐడియల్ కళాశాల విద్యార్థులు ట్రోఫీని కైవసం చేసుకున్నారు. రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10వ తేదీల్లో నిర్వహించిన అంతర కళాశాలల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఐడియల్ కళాశాల జట్టు పాల్గొంది. బుధవారం జరిగిన ఫైనల్ పోటీలో ఐడియల్ కాలేజీ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంతో ప్రథమ స్థానం సాధించి అంతర కళాశాలల ఫుట్‌బాల్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ జట్టు సభ్యులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సత్యనారాయణ, డైరెక్టర్స్ ఎం.రంజిత్, కేఎస్ వాసు, పీడీ పెమ్మాడి శ్రీను క్రీడాకారుల్ని అభినందించారు.

క్రీడా సంబరం...



- జేఎన్టీయూకేలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలు
- ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు
- కాకినాడ జిల్లాలో 3చోట్ల టోర్నమెంట్
- ఈ నెల 14 వరకూ నిర్వహణ
- మొదటి రోజు 40 మ్యాచ్‌లు



బెలూన్లు వదిలి పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో అసోషియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయూ) సహకారంతో వర్శిటీ మైదానంలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జేఎన్టీయూకే, సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహించే వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే, ఏపీ వాలీబాల్ సంఘ అధ్యక్షులు, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పి.గణవెంకట రెడ్డినాయుడు(గణబాబు) ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. వర్శిటీ క్రీడా మైదానంలో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత, మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి.వెంకటరమణ, గౌరవ అతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఏఐయూ పరిశీలకులు డాక్టర్ ఈ.త్రిమూర్తులు హాజరయ్యారు. ఈనెల 14 వరకూ జరిగే ఈ టోర్నమెంట్‌లో సుమారుగా 138 జట్లు పాల్గొంటున్నాయి. పోటీలను 4పూల్స్‌గా విభజించారు. పూల్ ఏ, బీ పోటీలు జేఎన్టీయూకే మైదానంలో, పూల్ సీ పోటీలు అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లో, పూల్ డీ లోని జట్లకు సంబంధించిన పోటీలు సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్నాయి. జ్యోతి ప్రజ్వలన అనంతరం అతిథులు జాతీయ జెండాను, క్రీడాపతాకాన్ని ఆవిష్కరించి పోటీల్లో పాల్గొంటున్న జట్ల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి...

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ క్రీడాకారులకు అభినందనలు తెలిపి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కాకినాడ జిల్లాలో ఎంతో సుందరమైన టూరిస్టు ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. ఏఎస్పీ మాట్లాడు తూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడాకారులు తమపై తాము నమ్మకం ఉంచుకుని బాగా రాణించినపుడే విజయం సాధించవచ్చని తెలిపారు. వీసీ మాట్లాడుతూ కాకినాడ జేఎన్టీయూకే వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతలను అప్పగించిన ఏఐయూకు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులు, అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. టోర్నమెంట్‌లో మొదటిరోజు 40మ్యాచ్‌లు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డీ కోటేశ్వరరావు, వర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి, టోర్నమెంట్ కన్వీనర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ జీపీ రాజు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, మాజీ వీసీలు ప్రసాదరాజు, పద్మరాజు డైరెక్టర్లు కృష్ణమోహన్, బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, పీడీలు వెంకటేశ్వరరావు ఉన్నారు.

క్రమశిక్షణ అవసరం...

ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడి ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుం చి వచ్చిన క్రీడాకారులు, జట్ల మేనేజర్లకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా జేఎన్టీయూకే ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు కల్పించడం జ రిగిందన్నారు. క్రీడాకారులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని దీని ద్వారా చదువులోనూ, క్రీడల్లోనూ రాణించగలరని తెలిపారు. వెంకటరమణ మాట్లాడుతూ వాలీబాల్ క్రీడాకారులు కష్టపడి ఆడుతూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అంతేకాకుండా కష్టపడి ఆడినవారు ఎప్పటికైనా విజయం సాధిస్తారన్నారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు





క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న అధికారులు



ఆహారం రెడీమేడ్!

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

పక్షులకు ఆహారం పెట్టడానికి ధాన్యం కుచ్చులను ఇళ్ల వద్ద ఏర్పాటు చేస్తుంటారు. అయితే వాటిని రెడీమేడ్ దుస్తుల్లా సిద్ధం చేసి అమ్మేస్తున్నారు. కాకినాడలో సైకిల్‌కు ధాన్యం కుచ్చులను తగిలించి విక్రయాలు చేస్తున్న దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా...

అన్నవరం దేవస్థానం ఈవోగా త్రినాథరావు బాధ్యతల స్వీకరణ

భక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఆలయ సిబ్బందికి సూచన

అన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా నియమితులైన వేండ్ర త్రినాధరావు బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా స్వామిని దర్శించుకున్న ఆయన అనివేటి మండపంలో ఇప్పటివరకు ఈవోగా ఉన్న వీర్ల సుబ్బారావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సుబ్బారావుకు వీడ్కోలు పలికి త్రినాథరావుకు స్వాగతం పలికారు. అనంతరం ఈవో కార్యాలయంలో త్రినాథరావు సిబ్బందితో సమావేశమయ్యారు. గతంలో మూడు పర్యాయాలు అన్నవరం దేవస్థానం ఈవోగా పనిచేసిన అనుభవంతో సిబ్బందితో ఎటువంటి పరిచయ కార్యక్రమం లేకుండానే పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో భక్తుల అసంతృప్తి శాతం అధికంగా ఉండడంతో అన్నవరం దేవస్థానం ఆరోస్థానానికి పరిమితమయిన సంగతి తెలిసిందే. అయితే భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ వారి సందేహాలను విసుగుచెందకుండా నివృత్తి చేయాలని, సిబ్బంది సమష్టిగా పని చేస్తే మొదటిర్యాంక్ రావడం పెద్ద కష్టమేమి కాదని సూచించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు, ఈఈ రామకృష్ణ, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్, ఏఈవోలు సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న త్రినాథరావు

బైక్‌లు కొట్టేసి... డబ్బులతో జల్సాలు చేసి!

రాజమహేంద్రవరంలో ముగ్గురు దొంగల అరెస్ట్

రూ.17.40 లక్షల విలువైన 29 ద్విచక్రవాహనాల స్వాధీనం





వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్... నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేస్తున్న ద్విచక్రవాహనాలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం నగరానికి వచ్చాడు. చిన్న పనిలో కుదిరాడు. కష్టపడుతూ బతుకుతున్నాడు. ఓ రోజు బైక్ నడపాలనే కోరికతో మారుతాళంతో ప్రయత్నించగా ఫలించింది. డబ్బులు బాగా వస్తుండడంతో బుద్ధి వక్రించి ద్విచక్ర వాహనాల దొంగగా మారాడు. ఆ డబ్బులతో జాల్సాలు చేశాడు. ఆపై పోలీసుల వలకు చిక్కడంతో అతడితోపాటు దొంగతనం చేసిన వాహనాలు కొనుగోలు చేసిన ఇద్దరిని కటకటాల్లోకి నెట్టారు. బుధవారం సెంట్రల్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు.

హోటల్‌లో నైట్‌బాయ్‌గా చేరి...

తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరుపేటకు చెందిన సబ్బు వీరబాబు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. అమ్మమ్మ దగ్గర పెరిగాడు. తర్వాత రాజమహేంద్రవరం వచ్చి పుష్కర్‌ఘాట్ సమీపంలోని ఓ హోటల్‌లో నైట్‌బాయ్‌గా ఉద్యోగంలో చేరాడు. పగలు వెల్డింగ్ పనులకు వెళ్లేవాడు. అయితే ఒక రోజు బైక్ నడపాలని అనుకున్నాడు. కానీ కొనుక్కొనే పరిస్థితి లేదు. దీంతో పుష్కర్ ఘాట్ వద్ద పార్క్ చేసిన ఓ మోటార్ సైకిల్‌ని మారు తాళంతో ప్రయత్నించగా పని జరిగింది. కొంత కాలం ఆ బైక్‌ని వాడుకున్నాడు. తర్వాత స్నేహితులైన కోసూరి పవన్ కుమార్, జర్గాని అప్పన్నకు అమ్మేశాడు. ఆ డబ్బులతో జల్సాలు చేశాడు. అదే పని బాగుందనుకుని ద్విచక్ర వాహనాల దొంగగా మారాడు. పుష్కర్‌ఘాట్, కోటగుమ్మం, మల్లయ్యపేట, సుబ్రహ్మణ్య మైదానం, లాలాచెరువు రోడ్, ఇస్కాన్ దేవాలయం, వాడపల్లి గుడి ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగిలించాడని డీఎస్పీ వివరించారు. వీరబాబుతో పాటు కొయ్యూరు మండలం మఠం భీమవరం గ్రామానికి చెందిన పవన్‌కుమార్, గోకవరం మండలం అచ్యుతాపురానికి చెందిన అప్పన్నని అరెస్టు చేసి రూ.17.40 లక్షల విలువైన 29 ద్విచక్ర వాహనాల స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనాలకు యజమానులు వీల్ లాక్‌లు, జీపీఎస్‌లు అమర్చుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని త్రీటౌన్ సీఐ వీ.అప్పారావు సూచించారు. దొంగలను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ వి.అప్పారావు, ఎస్ఐ ఎండీ జుబేర్, హెచ్‌సీలు వీ.కృష్ణ, ఎన్.వెంకట రామయ్య, ఎస్.చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు బి.విజయ్ కుమార్, కె.పవన్ కుమార్, ఆర్.సుబ్రహ్మణ్యాన్ని ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

రత్నగర్భ గణపతి ఆలయంలో చోరీ

రూ.10 లక్షల విలువైన 7 కిలోల వెండి ఆభరణాలు దోచుకెళ్లిన దుండగులు



ఆలయం వద్ద పరిశీలిస్తున్న ఎస్ఐ మౌనిక

పెద్దాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం ఆర్‌బీ పట్నంలోని రత్నగర్భ గణపతి ఆలయంలో బుధవారం భారీ చోరీ జరిగింది. రాఘవమ్మ చెరువు గట్టు సమీపంలో ఉన్న ఈ ఆలయాన్ని గ్రామస్తులు పునర్నిర్మించారు. మంగళవారం అర్థరాత్రి ఆలయంలోకి దొంగలు చొరబడి స్వామివారికి కిరీటం, కలశం, చిన్న వినాయక విగ్రహం దోచుకెళ్లినట్టు గ్రామస్తులు తెలిపారు. స్వామివారికి నిత్యం అలంకరించబడి ఉండే 7 కిలోల వెండి వస్తువులు విలువ సుమారు రూ.10 లక్షల వరకూ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు సమకూర్చిన ఈ వెండి ఆభరణాలు చోరీకి గురికావడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. అలాగే ఈ చోరీ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో సమీపంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పోలీసు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

రంపచోడవరం/గంగవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా గంగవరం మండలంలో టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకులు బుధవారం సాయంత్రం కత్తితో దాడి చేసి గాయపర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. పిడతమామిడి గ్రామానికి చెందిన రెడ్డి వేణుగోపాల్ రెడ్డి టీడీపీ కార్యకర్త. పంచాయితీ ఎన్నికలకు అందరినీ సన్నద్ధం చేస్తున్న పరిణామంలో స్థానికంగా ఉండే వైసీపీ నాయకులకు ఓర్వలేక వేణుగోపాలరెడ్డితో ఘర్షణకు దిగారు. యెజ్జు వెంకటేశ్వరరావు, యెజ్జు రామకృష్ణ, తుమ్మల చిట్టిబాబు, బలిజ వీరబాబు, జగ్గు నూకరాజు వేణుగోపాలరెడ్డిపై దాడి చేసి గాయపర్చారు. రామకృష్ణ కత్తితో దాడి చేయగా వేణుగోపాలరెడ్డి చేతికి గాయమైంది. దీంతో ప్రాణాలను కాపాడుకోవడానికి అక్కడి నుంచి పారిపోయి, పిడతమామిడి పీహెచ్‌సీకి చేరుకుని వైద్యం అనంతరం దాడి విషయాన్ని మండలంలో టీడీపీ నాయకులకు అందించారు. వారు బాధితుడ్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం రాత్రి బాధితుడ్ని పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధ్యులపై తగు చర్యలను తీసుకోవాలని పోలీసులను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ ఎదుగుదలను సహించలేని వైసీపి ఎమ్మెల్సీ అనంతబాబు తన నాయకులతో ఇటువంటి దాడులకు పురిగొల్పుతున్నాడన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలను తీసుకుని తమ కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలుస్తామని తెలిపారు.

స్విమ్మింగ్ పోటీల్లో యానాం విద్యార్థికి కాంస్యం



తోటి క్రీడాకారులతో వెంకటనాగసాయి

యానాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాంశాఖ విద్యార్థి ప్రతిభ చాటి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడని సెంటర్ ఇన్‌చార్జ్ ఉదయ్‌కుమార్ తెలిపారు. సౌత్ ఆఫ్రికాలోని మోసల్‌బే జరిగిన యూఐపీఎమ్ బైతెల్-ట్రైతెల్ లెజర్ వరల్డ్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో అండర్-15 విభాగంలో యానాం సాయ్ విద్యార్థి వీసం వెంకటనాగసాయి ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

గండేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మండలంలోని మురారిలో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు తెలిపారు. మృతదేహంపై ఎటువంటి దెబ్బలు లేవన్నారు. వయస్సు 70 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచామని ఆచూకీ తెలిసిన వారు 9440904841, 9440796529లో సంప్రదించాలని కోరారు.




సూసేకి అగ్గిరవ్వ మాదిరి...

సూరీడు.. అగ్గిరవ్వ మాదిరి కనిపించాడు. శివలింగంపై ఎర్రటి తేజస్సును కురిపించాడు. గోదావరిపై తన కాంతిని ప్రసరింపజేశాడు. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద కనిపించిన ఈ అద్భుతమైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి కెమెరా' ఒడిసిపట్టిందిలా...

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం







చెట్లను కొట్టేయాల్సిందేనా?

సజీవంగా వేరే ప్రాంతాలకు తరలించవచ్చంటున్న స్థానికులు

అటవీశాఖ అధికారులు చొరవ చూపాలని అభ్యర్థన



చెట్టును నరికి కలపను వ్యాన్‌పై తరలిస్తున్న దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల లాకుల వరకు 3.1కిలోమీటర్ల సర్వీసు రోడ్డు నిర్మిస్తున్నారు. దీని నిమిత్తం ఈ రోడ్డులో హైవే పక్కగా ఉన్న వివిధ వయసుల్లో ఉన్న 96 చెట్లను నరికివేస్తున్నారు. దీనికి నేషనల్ హైవే అధికారుల అభ్యర్థనకు అటవీశాఖ అధికారులు అంగీకరించారు. వీటి తొలగింపునకు ధరలు నిర్ణయించి అనుమతులు ఇచ్చారు. ఆ ప్రకారం ఎన్‌హెచ్ అధికారులు వేలంపాటలు నిర్వహించి చెట్లు తొలగించడానికి ఒక వ్యక్తి అప్పగించారు. వా టిని ముక్కలుగా నరికి కట్టెలుగా మాత్రమే తరలించాలని అధికారులు ఆదేశించారు. కళ్ల ముందు పెరిగిన చెట్లను ఇలా నరికేయడం బాధ కలిగిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని సజీవంగా వేరేచోటకు తరలించి బతికించవచ్చని, కడియం నర్సరీ రైతులు ఈ తరహాలో ప్రత్యేక యంత్రాలతో సజీవంగా వేరే ప్రాంతాలకు తరలిస్తున్నా రని వారు చెప్తున్నారు. కానీ ఇలా సజీవంగా చెట్లు తరలించడానికి వాల్టా చట్టం ఒప్పుకోదని, అందువల్ల ఎవరూ వీటిని తరలించే ఏర్పాటు చేయొద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పైగా, ఇలా అనుమతి ఇస్తే నర్సరీల వాళ్లు ఇతర ప్రాంతాల్లో కూడా చెట్ల ను తరలిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అలా ఐతే, అటవీశాఖ అధికారుల పర్యవేక్షణలోగానీ, వేరే ఇతర సంస్థలకు అప్పగించి గానీ చెట్లను సజీవంగా ఇతర ప్రాంతాలకు తరలించి బతికించాలని వాటితో అనుబంధం ఉన్న స్థానికులు కోరుతున్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రైతాంగ సమస్యలపై సీపీఐ నిరసన



మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట సీపీఐ నిరసన దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కనీసం గోనె సంచులు కూడా అందించలేకపోవడం దారుణమన్నారు. తేమ శాతం, ధాన్యం రంగు మారిందనే సాకుతో, తాలు, తప్పలు ఉన్నాయని ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు అనేక కొర్రీలు పెడుతున్నారన్నారు. కస్టోడియన్ ఆఫీసర్లు, రైస్ మిల్లర్లు కుమ్మక్కయి ధాన్యం దళారులకు అమ్ముకునే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, ఏఐకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

డీఆర్‌డీఏ పీడీ మూర్తి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ మూర్తి

బిక్కవోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలందర్నీ పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని వీవోఏలు, ఓబీలను డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఐబీ విజన్ శిక్షణా కార్యక్రమంలో రెండో రోజైన బుధవారం పీడీ మూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు ముడి సరుకులు తెచ్చుకుని వస్తువులను తయారు చేయడంతో పాటు, మరి కొందరికి ఉపాధి కల్పించినప్పుడే పారిశ్రామికవేత్తలవుతారన్నారు. స్వయం శక్తి సంఘాలు ఆదర్శంగా వుండాలంటే పంచసూత్రాలను పాటించాలన్నారు. మహిళలందరూ సొంతంగా నిర్ణయాలు తీసుకున్నప్పుడే మహిళా సాధికారత సాధిస్తారన్నారు. డ్వాక్రా మహిళలకు ఆరోగ్యం, విద్యపై అవగాహన పెంచి వారి పేదరికాన్ని నిర్మూలించి, జీవనోపాధి మెరుగు పడేలా చూడాలన్నారు. తీసుకున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని వారి ఆర్థిక స్థితిని పెంచుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుప్రియ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చిన్నమ్ములు, బులిరాజు, పద్మారావు, విజయ తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదల ఉంటే అద్భుత విజయాలు


నిఖిల్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం పార్థసారధి

రంగంపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే అంగవైకల్యాన్ని అధిగమించి అద్భుత విజయాలు సాధించవచ్చని హెచ్‌ఎం వి.పార్థసారధి అన్నారు. బుధవారం రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాల విద్యార్థి యమ్మిరెడ్డి వీరమణినిఖిల్‌ను అభినందించిన తర్వాత మాట్లాడారు. ఈ నెల 9న రాజమహేంద్రవరంలో జరిగిన ప్రత్యేక ప్రతిభావంతుల జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో నిఖిల్ పాల్గొని లాంగ్‌జంప్‌లో మొదటిస్థానం సాధించి బంగారు పతకాన్ని, షార్ట్‌పుట్, రన్నింగ్‌లో తృతీయస్థానం సాధించి కాంస్య పతకాన్ని పొందడం అభినందనీయమన్నారు.దీనిని ప్రోత్సహించిన ఐఆర్టీలు ఎంఎస్ ప్రసాద్, అంజలి, తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను అరికట్టాలంటూ ఆందోళన


శివరామపట్నంలో ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులను అరికట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని శివరామపట్నంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. బెల్ట్ షాపులను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆందోళనకారులు ఆరోపించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ గ్రామంలో బెల్ట్ షాపులు పెరిగిపోయయాని, ఎప్పుడంటే అప్పుడు మద్యం దొరుకుతుందని, దీనివల్ల ప్రజలు మద్యానికి బానిసై రోగాల బారిన పడుతున్నారని, యువత పెడదోవ పడుతోందని, మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే మద్యం బెల్ట్ షాపులను అరికట్టాలని లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.సతీష్, రామలింగేశ్వరరావు, కుంచే అంజిబాబు, జోకా పెద్ద, అర్జున్, రమణ, నాగేశ్వరరావు, వీరలక్ష్మి, సూర్యావతి, నాగమణి పాల్గొన్నారు.

ఆయుష్‌మిత్రలకు శిక్షణ

కడియం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో సాధారణ వ్యాధులకు వైద్య సేవలందించే ఆయుష్‌మిత్రలకు బుధవారం వేమగిరి బుద్ధవిహార్‌లో శిక్షణా తరగతులు జరిగాయి. కడియం ఆకుమందు వైద్యులు, దేశీయ వైద్య సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఎస్‌వీవీ సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బుద్ధవిహార్‌లో ఉన్న ఆయుర్వేద మొక్కల ద్వారా తయారు చేసే మందులను గూర్చి అడ్డతీగల - లయ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ జి.బుల్లియ్య వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో భాగంగా అటవీ అకాడమీని, బుద్ధవిహార్‌ను సందర్శించినట్టు చెప్పారు. ఆయుర్వేద వైద్యంలో శిక్షణ పొందిన కమ్యూనిటీ ఆయుర్వేదిక్ ప్రాక్టీషనర్స్ పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన 40 మందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.వీరు సాధారణ వ్యాధులకు సేవలందించడం, మొక్కలు రక్షించడం, ఆదివాసీలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తారన్నారు.కార్యక్రమంలో మహోదయ యాజరా, గుబ్బల వెంకటేశ్వరరావు, గౌరీశు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని మూడు కార్లు ధ్వంసం


ప్రమాదంలో ధ్వంసమైన కారులు



ధవళేశ్వరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద 216వ నెంబరు జాతీయ రహదారిపై ఇండస్ట్రీయల్ కాలనీ సమీపంలో ఇసుక లోడుతో వేమగిరి వైపు వెళుతున్న టిప్పర్ ముందు ఉన్న బాలినో వాహనాన్ని ఢీకొట్టడంతో వెనుక భాగం నుజ్జయింది. ఈ ధాటికి పక్కనే ఉన్న వాహనంతో పాటు ముందు ఉన్న కొత్త క్రిటా కారు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. అయితే 3 కారుల్లోను డ్రైవర్ సీట్‌లో తప్ప ఇంకెవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదం వల్ల జాతీయరహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. హైవే పెట్రోలింగ్ పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి కారణమైన ధవళేశ్వరం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల బుధవారం జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. దీనిలో భాగంగా బూరుగుపూడిలో బత్తుల సత్యవేణికి రూ.39,638, మధురుపూడిలో బొండు రత్నంకు రూ.36,360 బుచ్చింపేటలో మద్దపాక గన్నెంకు రూ.20,524, రాయుడు పాపారావుకు రూ.42,800, కాపవరంలో పచ్చారి యశ్విత్‌రామ్ కుటుంబానికి రూ.41,048, మునగాలలో మేడిశెట్టి యశ్వంత్‌కు రూ.20 వేలు, త్యాగపాటి ద్రోణుడుకు రూ.55250, కోటిలో చాకలి ధనబాబు రూ.30 వేలు విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమాల్లో జనసేన మండలాధ్యక్షుడు అడ్డాల శ్రీను, అడపా శ్రీనివాస్, పోలేపల్లి రామారావు, బుజ్జి, పోలారావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కడియం నూతన కార్యవర్గం ఎన్నిక

కడియం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం వేమగిరి ఉన్నత పాఠశాలలో జరిగింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.షరీఫ్, కోశాధికారి ఈవీఎస్ ప్రసాద్, కార్యదర్శులు నాగభూషణం,చిలుకూరి శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికలో గౌరవాధ్యక్షుడిగా రవిశంకర్, అధ్యక్షుడిగా వేదుల ఎస్ఎన్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా బి.అబ్బాయి, ఉపాధ్యక్షులుగా బూలారత్నం,ఎ.దొరబాబు, కోశాధికారిగా పీవీవీ గోపాలకృష్ణ,ఇతర కార్యవర్గం ఎన్నికయ్యారు.ముందుగా ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు.

కాపు జేఏసీ కన్వీనర్‌గా మాసరయ్య

దివాన్‌చెరువు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర కాపు జేఏసీ నియోజకవర్గ కన్వీనర్‌గా కొత్తతుంగపాడుకు చెందిన యాళ్ల మాసరయ్య నియమితులయ్యారు. ఆ విషయాన్ని స్థానిక విలేకరులకు బుధవారం ఆయన తెలిపారు. రాష్ట్ర కాపు జేఏసీ ఛైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు తన నియామకం జరిపారని చెప్పారు.

జీజీహెచ్‌లో గర్భిణి మృతి దురదృష్టకరం

» మాజీ ఎంపీ విమర్శలు అర్థరహితం
» ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్


వైద్యపరీక్షలకు వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వచ్చిన గర్భిణి డెలివరీ సమయంలో అధిక రక్తస్రావంతో మృతిచెందడం దురదృష్టకరమని, అది తనను తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన జీజీహెచ్ గైనిక్ విభాగాన్ని ఆయన సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్యసేవలు, ఇతర సదుపాయాలపై సమీక్ష చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ గర్భిణి మృతి విషయం తెలియగానే సంబంధిత అధికారులతో మాట్లాడానని, ఘటనపై లోతుగా విచారణ జరపాలని జీజీహెచ్ ఉన్నతాధికారులకు చెప్పానన్నారు. డాక్టర్ల నివేదికను పరిశీలించామని, అధిక రక్తస్రావంతో మృతిచెందడం చాలా అరుదుగా జరుగుతుందని చెప్పారని అన్నారు. కూటమి పాలనలో ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ, ఆరోగ్య రాజమండ్రి నినాదంతో ముందుకు వెళుతున్నామని, ఇందులో భాగంగా ఆసుపత్రి అభివృద్ధికి చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అందే వైద్యసేవలను ప్రభుత్వాసుపత్రుల్లోనూ ఉచితంగా అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మాజీ ఎంపీ భరత్‌రామ్ వ్యాఖ్యలపై ఆయన సీరియస్‌గాను, వ్యంగ్యంగాను స్పందించారు. భరత్‌రామ్ రాజకీయంగా పరిణతిలేని, అవగాహన లేని వ్యక్తి. ఆయన బాగా డిస్ట్రబ్‌గా ఉన్నాడు అన్నారు. అలాగే, శారీరకంగానే కాదు, మానసికంగాను కొంచెం పాడైనట్టు ఉన్నాడని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ అధినేత వాడుతున్నట్టుగా లండన్ మందులు వేసుకుంటే మంచిదని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. సంక్రాంతి పండగ నాటికి మోరంపూడి ఫ్లై ఓవర్ సర్వీస్‌రోడ్లకు గుంతలు పూడ్చే కార్యక్రమం పూర్తవుతుందని, వారం పదిరోజుల్లో లైట్లు వెలుగుతాయన్నారు. సమావేశంలో ఆర్‌ఎంవో సుబ్బారావు, కూటమి నాయకులు, హెచ్‌డీఎస్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
» కడియం సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


సీహెచ్‌సీలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుధవారం ఆయన కడియం సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. క్యూలో ఎక్కువ సేపు నిరీక్షిస్తున్న రోగులను చూసి వారు ఎక్కువ సేపు వేచి ఉండకుండా త్వరగా వైద్యసేవలందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని తెపడంతో నివేదిక ఇవ్వాలని తెలిపారు. వైద్యులు ఎళ్లవేళలా అందుబాటులో ఉండాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధురికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలతో శాంతి సమాధానం

స్థానిక ఆర్‌సీఎల్ చర్చిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఐక్య క్రిస్మస్ వేడుక జరిగింది. దీనికి ఎమ్మెల్యే గోరంట్లకు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్రీస్తు బోధనల ద్వారా సర్వమానవాళికి శాంతి సమాధానం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పాస్టర్లు ప్రార్థనలు చేశారు. అనంతరం సత్కరించారు. కొత్తపల్లి పౌలు క్రిస్మస్ సందేశం అందించారు. కార్యక్రమలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, ఫెలోషిప్ మండల ప్రెసిడెంట్ డీఎల్ మోదీ, వైస్ ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్, రీజనల్ ఛైర్మన్ పరంజ్యోతి, ఎక్జిక్యూటివ్ మెంబర్ ప్రసాద్, పలువురు పాస్టర్లు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు: ఎమ్మెల్యే నల్లమిల్లి


బిక్కవోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యూరియాపై రైతులు ఆందోళన చెందనవసరం లేదని, ఎక్కడా కొరత లేదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. బిక్కవోలు సొసైటీ వద్ద బుధవారం రాత్రి రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. రబీలో రైతులు మూడు సార్లు యూరియా వాడతారని ఇందుకు నాలుగు బస్తాలు సరిపోతాయన్నారు. అయితే కొరత ఉంటుందనే ఉద్దేశ్యంతో రైతులు ముందుగా నిల్వ చేసుకుంటున్నారని అందువల్ల యూరియాను క్యూల్లో నిలబడి తీసుకోవలసి వస్తుందన్నారు. ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు కృషి చేస్తోందని, సమయానికి అవసరమైన యూరి యా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందని, ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎం సీ ఛైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, సొసైటీ అధ్యక్షుడు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, నాయకులు పడాల వెంకట్రామారెడ్డి, పల్లి శ్రీనివాసరెడ్డి, బేరా వేణమ్మ,పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వెలుగుకు చిహ్నం ఏసుక్రీస్తు

బిక్కవోలులో మండల ఇవాంజలిస్ట్, పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మానవాళిని రక్షించడం కోసం, వారి లో వెలుగు నింపడానికి ఏసుక్రీస్తు అవతరించారన్నారు. అనంతరం ఆయనను ఇవాంజలిస్ట్, పాస్టర్లు సత్కరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ సువార్తికుడు జాన్‌వెస్లీ, ఎంపీపీ తేతలి సుమ, నాయకులు పడాల వెంకటరామారెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

రంగంపేట, డిసెంబరు 10 (ఆం ధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మం డల విద్యాశాఖ కార్యాలయాలు, జడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యో గులు తమకు ఉద్యోగ భద్రత, రెగ్యులర్ చేయడం, జీతాల పెంపు, ఆరోగ్య భద్రత, హెచ్‌ఆర్ పాలసీ, గ్రాట్యూటీ, ఎంటీఎస్ వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి రామవరంలో వినతి పత్రం అందించారు. తమను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములవ్వాలి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాజానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలని జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ వర్సిటీలో ఆంధ్ర శక్తి ఆధ్వర్యంలో ల్యాబ్ టు ల్యాండ్ అంశంపై జాతీయ స్థాయి సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. శక్తి జాతీయ కోఆర్డినేటర్, అక్కూ బోటనీ విభాగాధిపతి పద్మావతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, సాంకేతికత పట్ల సంసిద్ధత స్థాయి పెరగాలని అన్నారు. జీజీయూ పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ ఆర్ఎస్ రాజు మాట్లాడుతూ మహిళలు విద్యావంతులై అభివృద్ధి చెందాలన్నారు.కార్యక్రమంలో బెనారస్ హిందూ యూనివర్సిటీ ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ రామనాథన్, అమృత వర్సిటీ ప్రొఫెసర్ మృత్యుంజయ గుహ, ప్రొవైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, శక్తి సభ్యులు శారా, సుజాత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బహుభాషా ఉపన్యాస పోటీ

యూజీసీ లెర్న్ ఒక్ మోర్ భారతీ య భాషా కార్యక్రమం సందర్భంగా జీజీయూ, స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో భాషా సే బం ధన్ వాయిసెస్ ఆఫ్ మెనీ లాంగ్వేజెస్ పేరుతో బహుభాషా ఉపన్యాస పోటీ నిర్వహించారు. విద్యార్థులు సంభాషణలను తమిళం, బెంగాలీ, మలయాళం, ఒడియా, మరాఠీ, అస్సామీ, కన్నడ భాషల్లో ప్రవాహంగా అందించారు. 31 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో మొదటి, రెండో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

సెల్లార్లను పార్కింగ్‌కే వినియోగించాలి

12వ డివిజన్ పర్యటనలో మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా


బిల్డింగ్ కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భవనాల సెల్లార్లను పార్కింగ్‌కు మాత్రమే వినియోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. రాజమహేంద్రవరం 12వ డివిజన్‌లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. నూతన భవనాలను పరిశీలించి అవి నిర్దేశిత ప్లాన్ ప్రకారం ఉన్నాయో? లేవో? పరిశీలించారు. అలాగే ప్లాన్‌కి విరుద్ధంగా ఉన్న భవనాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. భవనాలకు సంబంధించి రోడ్లుపైకి వచ్చిన ర్యాంప్‌లను తొలగించాలని సూచించారు. భవనాల సెల్లార్లు పార్కింగ్‌కు కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులు పరిశీలన చేశారు. గౌతమి స్కూల్ వద్ద రహదారి అధ్వానంగా ఉండడంతో నూతన రహదారిని మంజూరు చేశారు.గాంధీనగర్-3 పార్కును సందర్శించి వ్యాయామ, ఆటల పరికరాలు మరమ్మతులకు గురైనవి ఉంటే బాగు చేయించాలని ఏఈకి సూచించారు. వార్డులో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీపీఎస్, ఎల్ఆర్ఎస్-2025పై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ప్రాంగణంలోని రుడా కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం బీపీఎస్, ఎల్ఆర్ఎస్ -2025 స్కీమ్‌లపై టౌన్ ప్లానింగ్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. యూఎల్‌బీ, ఎల్ టీపీలతో జరిగిన సదస్సులో బీపీఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకునే అంశంపై కులంకుశంగా అవగాహన కల్పించారు. అలాగే ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి లైసెన్స్ సర్వేయర్లకు అవగాహన కల్పించారు. 2026 ఫిబ్రవరి నాటికి బీపీఎస్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో భవనాల యాజమాన్యాలు ఈ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకునే విధంగాఅవగాహన కల్పించాలని, విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. 2026 బీపీఎస్‌కు మార్చి 10వ తేదీ వరకు, ఎల్ఆర్ఎస్‌కు 2026 జనవరి 10వ తేదీ వరకు గడువు ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. మున్సిపల్ ఆర్‌డీ నాగనరసింహారావు సమక్షంలో ఈ సదస్సు జరిగింది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, అసిస్టెంట్ సిటీప్లానర్లు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, యూఎల్‌బీలు, ఎల్‌టీపీలు, లైసెన్స్ సర్వేయర్లు మూడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

సీతానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగవరం గ్రామానికి చెందిన చొక్కా త్రివేణి(57) రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు. గత నెల 14న ఉదయం ఇంటి బయట త్రివేణి చలి మంట కాగుతుండగా చీరకు నిప్పంటుకుని కాలిపోగా స్థానికులు మంటలు ఆర్పి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డిజిటల్ లిటరసీపై అవగాహన అవసరం

ఇన్‌స్టిట్యూషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సంపత్


మన డబ్బులు యాప్‌పై అవగాహన కలిగిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ సంపత్

సీతానగరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి స్వయం సహాయక సంఘాల సభ్యులు డిజిటల్ లిటరసీపై అవగాహన కలిగి వుండాలని ఇన్‌స్టిట్యూషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సంపత్ అన్నారు. బుధవారం సీతానగరం మండల సమాఖ్య స్త్రీ శక్తి భవన్‌లో మండల సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణకుమారి ఆధ్వర్యంలో మన డబ్బులు, మన లెక్కలు యాప్ నిమిత్తం 59 గ్రామ సంఘాల సహాయకులకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ ఆర్థిక లావాదేవీలు ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా ప్రభుత్వం ఉమెన్ పవర్ అనే పేరుతో యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆ యాప్‌లో సంఘ సభ్యుల వారీగా ఆర్థిక లావాదేవీలు ఎప్పటికప్పుడు ఎలా నమోదు చేయాలి, తద్వారా లాభాలు, నష్టాలు ఏవిధంగా చూసుకోవాలని అవగాహన పొందలన్నారు. ఏమైనా ఉత్పత్తులుంటే నమోదు చేయవచ్చునని, ఆర్థిక లావాదేవీల విషయంలో ఏమైనా పొరపాటు ఉంటే గ్రీవెన్స్ ద్వారా సభ్యురాలు ఫిర్యాదు నమోదు చేయవచ్చునన్నారు.ఈ యాప్‌ను ప్రతి సభ్యురాలి సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సీసీ హరిబాబు, వెంకటలక్ష్మి, దార లక్ష్మి, అకౌంటెంట్ జయరాజు సంఘాల సహాయకులు పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో అగ్నిప్రమాదం

పాత బట్టలు దగ్ధం

దివాన్‌చెరువు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించి ఇంట్లో భద్రపరచిన పాతబట్టలు కాలి బూడిదయ్యాయి. లాలాచెరువు హౌసింగ్ బోర్డులోని ఎంఐజీ 259 గృహానికి మంటలు అంటుకున్నాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఇంట్లో భద్రపరచిన రూ.5 వేలు విలువైన పాతబట్టలు దగ్ధమయ్యాయని అగ్నిమాపక అధికారులు తెలిపారు. కాల్చిన సిగరెట్‌ను నిర్లక్ష్యంగా పారవేయడమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.


చిన్నారులను అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

ప్రతిభావంతులకు మంత్రి దుర్గేష్ అభినందన

రాజమహేంద్రవరం రూరల్ డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అరుదైన బుద్ధి- మనోనేత్ర ప్రతిభను ప్రదర్శిస్తూ అవార్డులు అందుకున్న పుల్లా సాయిదీపక్, పుల్లా సాయి అమృతలను బొమ్మూరులోని వారి నివాసంతో మంత్రి దుర్గేష్ అభినందించారు. మండలంలోని బొమ్మూరుకు చెందిన చిన్నారులు కళ్లకు గంతలు కట్టుకొని రంగుల చెప్పడం, చదవడం, డ్రాయింగ్ వేయడం, వస్తువులను గుర్తించడం వంటి ప్రత్యేక ప్రతిభ వారికి ఉందని మంత్రి తెలిపారు. కేవలం ఇది చిన్నారుల ప్రతిభ కాదని, క్రమశిక్షణ, కఠిన అభ్యాసం గురువులు, కుటుంబం ఇచ్చిన మార్గదర్శకత్వానికి ఫలితమని అన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లా రామారావు జనసేన నాయకులు పారంశెట్టి రవి, గట్టి నర్సయ్య చిన్నారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్‌పై సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని రుడా కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం బీపీఎస్,ఎల్‌ఆర్‌ఎస్ -2025 స్కీమ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. యుఎల్‌బీ, ఎల్‌టీపీలతో జరిగిన సదస్సులో బీపీఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. బీపీఎస్‌కు 2026 మార్చి 10వ తేదీ వరకు, ఎల్‌ఆర్‌ఎస్‌కు 2026 జనవరి 10వ తేదీ వరకు గడువుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టెట్..మాకొద్దంటూ టీచర్ల నిరసన



రాజానగరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు


రాజానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)నుంచి మినహాయించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రాజానగరంలో నిరసన ప్రదర్శన చేశారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ పాస్ కావాలని..లేకుంటే వారిని సర్వీసు నుంచి తొలగించాలని ఇచ్చిన ఉత్తర్వుల నుంచి టీచర్లను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, జిల్లా కార్యదర్శి దయానిధి, మండలాధ్యక్షురాలు రాజేశ్వరి, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవదేవుడి సేవకై..

గోకవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆ దేవదేవుడి సేవకు ఏదైనా కావాలని అడిగితే ఎవరు మాత్రం కాదంటారు.. మేం ఇస్తాం..మేం ఇస్తాం అంటూ పోటీపడతారు. అనుకున్నదానికంటే ఎక్కువే ఇస్తారు.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలకు ఎండు గడ్డిని సమకూర్చాలని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తలంచారు. ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా తెలియడంతో రైతులు క్యూకట్టారు. రైతాంగం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 12 లారీల ఎండుగడ్డిని అందించారు.జ్యోతుల నెహ్రూ బావాజీపేట వద్ద జెండా ఊపి తిరుమల తిరుపతి గోశాలకు లారీల ద్వారా తరలించి మాట్లాడారు. శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పశుగ్రాసాన్ని సేకరిస్తున్నామని, కొన్ని రోజుల కిందట తంటికొండ నుంచి ఆరు లారీల ఎండు గడ్డిని ఇప్పటికే తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిల్లా చంటిబాబు, పాలూరి బోస్, మంగరాతి రాము, గళ్ళా రాము, బొట్టా రామకృష్ణ, కోట సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలకు తరలించే ఎండుగడ్డి లారీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ఈ-బస్‌లు.. వస్తున్నాయ్!

2 జిల్లాలకు 100 బస్‌లు

కొత్తగా ప్రగతి రథచక్రాలు

వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 150 భారీ ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. తొలివిడత కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 100 బస్సులను కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కొన్ని నెలల కిందట రాజమహేంద్రవరం వచ్చినప్పుడు అధికారులతో ఈ విషయంపై చర్చ జరగ్గా ఉమ్మడి జిల్లాకు తొలి విడత కింద 150 బస్సులు అవసరమని వివరిం చారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాలకు ఈవీ బస్సులను కేటాయించాల్సి ఉన్న నేపథ్యంలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు వంద బస్సులను మాత్రమే కేటాయించారు. ఒక్కో బస్సులో 40 వరకు సీట్లుండే ఈవీ బస్సుల్లో అన్ని ఆధునిక సౌకర్యాలు ఉంటాయని అధికారులు వివరించారు. ఒక్కో బస్సు ధర రూ.1.50 కోట్లు.. 100 బస్సులకు రూ.150 కోట్ల అవుతుంది.

- ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి ఎలక్ట్రికల్ బస్సులు
- కాకినాడ, తూర్పునకు 100 కేటాయింపు
- కోనసీమకు మలి విడతలో ఛాన్స్
- ఆర్టీసీ అధికారులకు సమాచారం
- ఒక్కో బస్ ఖరీదు రూ.1.5 కోట్లు
- రూ.150 కోట్లతో కొనుగోలు
- ఆరు నెలల్లో రోడ్డెక్కనున్న బస్‌లు
- ఉమ్మడి జిల్లాలో 20 ఛార్జింగ్ స్టేషన్లు
- భారీగా ఖర్చు తగ్గుతుందని అంచనా

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో త్వరలో ఆర్టీసీ ఈవీ బస్సులు రోడ్డెక్కనున్నాయి. మరో ఆరు నెలల్లో ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 50 చొప్పున ప్రభుత్వం ఈవీ బస్సు లను కేటాయిస్తోంది.కోనసీమ జిల్లాకు ఈ దఫా వాయిదా వేసి మలివిడతలో కేటాయించనున్నారు. ఒక్కో బస్సు రూ.1.50 కోట్ల చొప్పున 100 బస్సులకు ప్రభుత్వం రూ.150 కోట్లు వెచ్చించబోతోంది.బస్సుల రాకతో ఖర్చుల భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు.

ఒక్కో బస్సులో 40 సీట్లు

గత వైసీపీ సర్కారు ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసింది. కొత్త బస్సుల కొనుగోలు, అదనపు రూట్లను అటకెక్కించేసింది. ఇప్పుడు ప్రభుత్వం ఆర్టీసీకి అన్ని విధాలా సహకారం అందిస్తుండడంతో ప్రయాణికులను దగ్గరయ్యేందుకు ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేస్తోంది.అందులో భాగంగా కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 50 బస్సులు కేటాయిస్తూ ఆదేశాలిచ్చింది.ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది.ఈవీ బస్సులకు రూట్లను ఎంపిక చేయాలని ఆదేశించడంతో తాజాగా అధికారులు పూర్తిచేశారు. ఒక్కో బస్‌లో 40 సీట్లు ఉంటాయి.

20 ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు

100 ఎలక్ట్రికల్ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్లకు భారీగా ఖర్చవుతుందని భావిస్తున్నారు. హైస్పీడ్‌తో కూడిన ఛార్జింగ్ కేంద్రాలను 20 వరకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, తునిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.బ్యాటరీ బైక్‌కు కనీసం 6 గంటల వరకు ఛార్జింగ్ చేస్తేనే గానీ బ్యాటరీ ఫుల్ కాదు. కానీ రాబోయే ఎలక్ట్రికల్ బస్సులకు 2 గంటలు ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ ఫుల్ కానున్నాయి. కొత్త ఎలక్ట్రికల్ బస్సులు భారీ బ్యాటరీ సామర్థ్యంతో తయారవుతాయి. రోజులో ఒకసారి ఛార్జింగ్ చేస్తే సరిపోవచ్చని అధి కారులు చెబుతున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎలక్ట్రిక్‌తో లాభాల పంటే..

ఇప్పుడు ఎక్కడ చూసినా ఎలక్ట్రికల్ వాహనాలపైనే మొగ్గుచూపుతున్నారు. ఆర్టీసీ సైతం ఈవీ బాట పట్టింది. వచ్చే ఏడాది జూన్ నాటికి ఎలక్ట్రికల్ బస్సులను భారీగా రోడ్లపైకి దించబోతోంది. ఇప్పటికే డీజిల్ ధరలు పెరగడంతో నానాటికీ నిర్వహణ వ్యయం తడిసి మోపెడవుతోంది. దీంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఆర్టీసీ చవిచూస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల సర్వీసుల్లోను కొత్త పద్ధతులు అనుసరించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఖర్చులు నియంత్రించుకోవాల్సిన అవసరత ఏర్పడింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కొత్త బస్సుల కొనుగోలు, రద్దీ రూట్లలో సర్వీసుల పెంపు వరకు అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది.అందులో భాగంగా ఇకపై ఈవీ బస్సులను భారీగా కొనుగోలు చేసి అందిస్తోంది.

రూట్‌లు ఇలా

వంద ఈవీ బస్సుల్లో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల నుంచి విశాఖ, విజయవాడ రూట్‌లో 46 బస్సులు నడపనున్నారు.కాకినాడ- అమలాపురం, రాజమహేంద్రవరం-అమలాపురం రూట్‌లో 12, కాకినాడ- రాజమహేంద్రవరం నగరాల మధ్య రోజుకు 14 రెండు జిల్లాల ఈవీ బస్సులు తిప్పాలని నిర్ణయించారు.కాకినాడ జిల్లాకు కేటాయించిన 50 ఎలక్ట్రికల్ బస్సుల్లో కాకినాడ-విశాఖపట్నం 30, కాకినాడ -రాజమహేంద్రవరం 7, కాకినాడ- అమలాపురం 6, కాకినాడ- నర్సీపట్నం 4, కాకినాడ-తుని 3 చొప్పున ఖరారు చేశారు. తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించిన 50 బస్సుల్లో రాజమహేంద్రవరం- విజయవాడ 16, రాజమహేంద్రవరం- కాకినాడ 12, రాజమహేంద్రవరం-అమలాపురం 12, రాజ మహేంద్రవరం-తుని 10 బస్సులను తిప్పేలా ప్రణాళిక ఖరారు చేశారు.ఈవీ బస్సుల్లో టికెట్ ధరలు బాగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఇండిగో ఎగిరే!

- సాధారణ స్థితికి రాకపోకలు
- ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీకాంత్

రాజమహేంద్రవరం/కోరుకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి ఇండిగో విమానాల రాకపోకలు సాధారణ స్థితికి తిరిగి చేరుకున్నాయని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎన్‌కే.శ్రీకాంత్ తెలిపారు. ప్రతి రోజూ రాకపోకలు సాగించే 10 విమానాల్లో ఒకటి మినహా అన్నీ అందుబాటులోకి వచ్చాయన్నారు. ఢిల్లీ-రాజమండ్రి విమానం ఆపరేషన్ పరిమితుల వల్ల గురువారం వరకూ రద్దు చేశారని చెప్పారు. అలయన్స్ ఎయిర్ ద్వారా తిరుపతి మార్గంలో రాకపోకలు సజావుగా కొనసాగుతున్నాయన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.కొద్ది రోజులుగా ఇండిగో విమానయాన సంస్థలో ఏర్పడిన సంక్షోభం వల్ల ఆ విమానాల గమనంలో తీవ్ర అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే.



దివాన్‌చెరువు
ఫ్లయ్ ఓవర్ పనులు ఆరంభం

దివాన్‌చెరువు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దివాన్‌చెరువులో నిర్మించనున్న ఫ్లయ్ ఓవర్ పనులు ప్రారంభం అయ్యాయి. గత వారం రోజులుగా వేగంగా సాగుతున్నాయి. దివాన్‌చెరువులో పండ్లమార్కెట్ నుంచి పాలచర్ల గామన్ వంతెనను కలుపుతూ దాదాపు 2.55 కి.మీ మేర ఫ్లయ్ ఓవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదించి టెండర్లను పిలిచిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి ప్రభుత్వం గతంలో సేకరించిన భూముల్లో ఉన్న కట్టడాలు, చెట్లు వంటి వాటిని ఎక్స్‌కవేటర్ల సహాయంతో తొలగించే పనులు చేపడుతున్నారు. అయితే భూసేకరణ విషయంలో కొంత మంది యజమానుల నుంచి వచ్చిన అభ్యంతరాలతో ప్రత్యేక సర్వేయర్లు బృందాన్ని నియమించి మరోసారి సర్వే చేయించారు. ఈ నివేదిక అధికారులకు అందిన తర్వాత దానిపై చర్యలు తీసుకుంటారు. ఫ్లయ్ ఓవర్ పనుల సమయంలో ట్రాఫిక్ మళ్లింపునకు ప్రస్తుతం తొలగింపులు జరుగుతున్న ప్రదేశంలో సర్వీస్‌రోడ్లు ఏర్పాటు చేస్తారని తెలిసింది. ఫ్లయ్ ఓవర్ పనుల కారణంగా వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. అటూ ఇటూ గోతులు తవ్వేయడంతో పక్కకు తప్పుకోవడానికి అవకాశంలేక వాహనాలన్నీ రోడ్డుపైనే వెళ్లాల్సి వస్తోంది. ట్రాఫిక్ రద్దీ కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. బుధవారం సంతను సైతం అంతంతమాత్రంగా నిర్వహించారు. దీంతో కొనుగోలుదారులు నిరాశగా వెనుదిరిగారు. సంబంధిత అధికారులు ఫ్లైఓవర్ పనులు వేగవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకొని వీలైనంత త్వరగా తమకు ట్రాఫిక్ చిక్కులు తప్పేవిధంగా చూడాలని కోరుతున్నారు.

ఈ పోస్ ద్వారా ఎరువులు విక్రయించాలి

10

డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాస్

జీజీహెచ్‌కు 20 శాతం బ్లడ్‌బ్యాగ్‌లు ఇవ్వాల్సిందే

జీజీహెచ్ సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులు ప్రతి నెలా సేకరించే రక్తసేకరణ యూనిట్లలో 20 శాతం ప్రభుత్వ బోధనాసుపత్రికి ఇవ్వాల్సిందేనని రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డితో కలిసి జిల్లాలోని ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల యాజమాన్యాలు ఈ రూల్స్‌ను కచ్చితంగా పాటించాలన్నారు. చాలా బ్లడ్‌బ్యాంకులు 20 శాతం బ్లడ్ యూనిట్లను అందిస్తున్నా కొందరు విస్మరిస్తున్నారని..ఇది సరికాదన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు, ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీపీపీఎఫ్ పరీక్షలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పోలీస్, కేంద్ర సాయుధ బలగాల్లోని సబ్-ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి బుధ వారం ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చెన్నై స్టాఫ్ సెలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పరీక్షలు నిర్వహించామని డీఆర్వో సీతారామ మూర్తి తెలిపారు. రెండు షిఫ్టుల్లో 122 మందికి 33 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

భూగర్భ జలాల పెంపుపై నివేదిక ఇవ్వండి



అధికారులతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో భూగర్భ జలాలను పెంచుకునే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని..ఆదిశగా క్షేత్రస్థాయిలో వెంటనే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్ కార్యాచరణపై నివేదిక ఇవ్వాలని కలె క్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ , భూగర్భ జలాలు, డ్వామా, గ్రామ, వార్డు సచివాలయ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో భూగర్భ జలాల పెరుగుదల దిశగా స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డ్వామా ఆధ్వర్యంలో డీసిల్టేషన్, ఇంకుడు గుంతలు, కుంటల పునరుద్ధరణ వంటి పనులకు సంబంధించి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 88 గ్రామాల్లో భూగర్భ జలాలు అత్యల్ప, 122 గ్రామాల్లో సగటు కంటే తక్కువగా ఉన్నాయన్నారు. భూగర్భ జలాల పెంపుపై దృష్టి సారిస్తే రూ.5 వేల కోట్ల ఆర్థిక వనరులు పరిరక్షిం చుకునే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే సమావేశం నాటికి అధికారులు సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు.కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ గోపీనాథ్, భూగర్భ జలాల డీడీ వై.శ్రీనివాస్, డీడీఏ అధికారి పి.వీణాదేవి, డ్వామా ఏవో కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మేలురకం పశువీర్యం సరఫరా చేయాలి

డీడీ రాజేంద్రప్రసాద్‌తో రైతులు



దూడలు పరిశీలిస్తున్న డీడీ రాజేంద్రప్రసాద్

గోపాలపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు మేలుజాతి పశువుల పెం పకంతో అధిక పాల దిగుబడి సాధించవచ్చని పశుసంవర్ధక శాఖ డీడీ టి.రాజేంద్రప్రసాద్ అన్నారు. పెద్దాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్సపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాడి రైతులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పశువులు పాముకాటుకు గురైన సమయంలో అవసరమైన వ్యాక్సిన్ అందుబాటులో లేక పశువులు మృతిచెందతున్నాయని తెలిపారు. పశువుల గర్భధారణకు అవసరమైన మేలురకం వీర్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న వీర్యంతో నాశిరకం దూడలు పుడుతున్నాయన్నారు. అత్యధికంగా పాల ఉత్పత్తి చేస్తున్న ముగ్గురు రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డీఎం.నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.శశికుమార్, శేఖర్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళాలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో శుక్రవారం (12న) కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ,డిప్లమో,బీటెక్, ఎంబీఏ ఉత్తీ ర్ణులై 35 ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి రూ.25 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు.వివరాలకు 76608 23903లో సంప్రదించాలన్నారు.


ఉపాధి కార్యాలయంలో

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని మోడల్ కేరీర్ సెంటర్ ప్రాంగణంలో శుక్రవారం (12న) జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కె.హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. దీని ద్వారా రాదిశా టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో వంద ఖాళీలను భర్తీ చేస్తారన్నారు. 19-25 మధ్య వయసు కలిగి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ చదివిన వాళ్లు అర్హులని చెప్పారు. https://tinyurl.com/jf1may25 లింక్ ద్వారా పూర్తి వివరాలతో రిజిస్టరు చేసుకోవాలన్నారు. వివరాలకు 9533221189 నెంబరులో సంప్రదించాలన్నారు.

21న పల్స్ పోలియో

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిసెంబరు 21న జరిగే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో బుధవారం పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్య, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం కోసం సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,89,550 మంది పిల్లలను లక్ష్యంగా గుర్తించామని, వీరికోసం 1,084 పోలియో బూత్‌లు, 62 ట్రాన్సిట్ టీమ్‌లు, 53 మొబైల్ టీంలను ఏర్పాటు చేశామన్నారు.

ఇలాగైతే.. ఎలాగండి!



- శస్త్రచికిత్స సమయంలో తప్పనిసరి
- అయినా లేవంటున్న సిబ్బంది
- ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు
- ఒక్కొక్కటి రూ.300 నుంచి రూ.500
- లబోదిబోమంటున్న బాధితులు
- డ్రగ్ స్టోర్‌లో స్టాకుపై అనుమానాలు
- సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

జీజీహెచ్‌లో నీరుడు బ్యాగుల కొరత

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఫోలీ బెలూన్ కేథటర్ (నీరుడు బ్యాగులు)లకు తీవ్ర కొరత ఏర్పడింది. శస్త్ర చికిత్సలు చేసే సమయంలో ఈ బ్యాగులను తప్పనిసరిగా వినియోగిస్తుంటారు. దీంతో రోగి కుటుంబీకులు ప్రైవేట్ మెడికల్ షాపుల నుంచి వీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. సమయం, డిమాండ్‌ను బట్టి ఒక్కో బ్యాగు రేటు రూ.300 నుంచి రూ.500ల వరకూ కొనుక్కోవాల్సి రావడం బాధిత కుటుంబీకులకు అదనపు భారంగా మారుతోంది. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే పేషెంట్ల కుటుంబీకులకు రాత్రి సమయంలో వీటి అవసరం పడితే ఎక్కడికి వెళ్లాలో తెలియక వారి పరిస్థితి దయనీయంగా మారుతున్నదని చెబుతున్నారు. నాలుగు రోజుల కిందట ఏజెన్సీ నుంచి వచ్చిన ఒక కేసుకు నీరుడు బ్యాగు అవసరమై అర్ధరాత్రి సమయంలో దానవాయిపేటలోని ఒక మెడికల్ షాపునకు వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చిందని తెలిసింది. నిజానికి జీజీహెచ్‌లో ఈ నీరుడు బ్యాగులను ఉచితంగా అందివ్వాలి. కానీ ఇవ్వడంలేదు. అధికారులు పట్టించుకోవడంలేదు.

స్టాకుపై అనుమానాలు?

జీజీహెచ్ డ్రగ్ స్టోర్‌లోని నీరుడుబ్యాగుల స్టాకుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు పలు ఫిర్యాదులు రావడంతో బుధవారం స్టోర్ అధికారుల పిలిపించి బ్యాగులపై ఆరా తీశారు.అన్ని విభాగాలకు పంపుతున్నామని, ఎంసీహెచ్ బ్లాకు నుంచి మాత్రం ఇండెంట్ రాలేదని లెక్కలు చెప్పినట్టు తెలిసింది. ఇంకా తమ వద్ద 200 వరకూ బ్యాగులు ఉన్నాయని కూడా వివరించినట్టు సమాచారం. ఇదే నిజమైతే శస్త్ర చికిత్సలకు వచ్చిన వారిని బయటి నుంచి ఎందుకు తెచ్చుకోమంటున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి కాకినాడ సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ఏదైనా డ్రగ్ లేదా పరికరం సరఫరా లేకపోతే లోకల్ పర్చేజ్ చేసుకునే వెసులుబాటు జీజీహెచ్ అధికారులకు ఉంటుంది. కానీ నీరుడుబ్యాగులను గత కొన్ని నెలలుగా కొనుగోళ్లు నిలిపివేసినట్టు తెలిసింది. లోకల్ పర్చేజ్‌లో నీరుడుబ్యాగులు సరఫరా చేసే కాకినాడలోని ఒక మెడికల్ స్టోర్ నుంచి ఇక్కడున్న కొంతమందికి కమీషన్లు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. దీంతో జీజీహెచ్‌లోని ఒక ఉన్నతాధికారి కాకినాడ నుంచి కాకుండా విజయవాడ నుంచి బల్క్‌గా కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చినట్టు సమాచారం. దీంతో మొత్తం పర్చేజ్ నిలిపివేశారనే ప్రచారం జరుగుతోంది. ఏదేమైనా శస్త్ర చికిత్సల సమయంలో అత్యవసరమైన ఫోలీ బెలూన్ కేథటర్ (నీరుడు బ్యాగుల) అందుబాటులో లేవనే వ్యవహారం జీజీహెచ్ పరువును రోడ్డున పడేసేలా ఉందని ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.



అధికారులు పట్టుకున్న ఇసుక లారీ

ఇసుక అక్రమంగా తరలిస్తున్న 4 లారీలు సీజ్

కొవ్వూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న 4 లారీలను సీజ్ చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుక ర్యాంపు నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక లోడ్ చేసుకుని అక్రమంగా తరలిస్తున్న 4 ఇసుకలారీలను బుధవారం డివిజనల్ టాస్క్‌ఫోర్సు ఏఎస్‌ఐ జి.జి.ప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సీజ్ చేసిన లారీలపై తదుపరి చర్యలు నిమిత్తం మైనింగ్ అధికారులకు సిఫార్సు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.